నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ మంగళవారం 19-1-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 143 పేజీలు: 4 వెల: రూ.1/-

తెలంగాణ రైతాంగ పోరాటయోధుడు బూర్గుల మృతి

సంతాపం ప్రకటించిన సిపిఐ నేతలు
మంచి ఉద్యమ నేత అని కొనియాడిన కెటిఆర్

హైదరాబాద్,జనవరి18(ఆర్ఎన్ఎ): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు, అమరవీరుల స్మారక ట్రస్ట్ అధ్యక్షుడు, ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు బూర్గుల నర్సింగరావు(89) కన్నుమూశారు. కరోనాతో బాధపడుతున్న ఆయన నగరంలోని కేర్ ఆసుపత్రిలో ఈ ఉదయం తుదిశ్వాస విడిచారు. నర్సింగరావు అంత్యక్రియలు మధ్యాహ్నం 12 .30 గంటలకు జూబ్లిహిల్స్ మహాప్రస్థానంలో నిర్వహించారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఉద్యమంలోనూ తనవంతు పాత్ర పోషించిన నర్సింగరావు మృతి పట్ల.. వారి మరణం పట్ల వామపక్ష పార్టీల నాయకులు సురవరం సుధాకర్ రెడ్డి, డాక్టర్ కె. నారాయణ, చాడ వెంకట్ రెడ్డి, అజీజ్ పాషా, పల్లా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు, తెలంగాణ అమరవీరుల ట్రస్టు కార్యదర్శి కందిమల్ల ప్రతాపరెడ్డి, ఆరుట్ల ఫౌండేషన్ అధ్యక్షురాలు ఆరుట్ల సుశీల తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలిపారు. సీపీఐ సీనియర్ నేత నారాయణ మాట్లాడుతూ.. అహర్నిశలు కమ్యూనిస్ట్ ఉద్యమ పురోభివృద్ధికి కృషి చేశారన్నారు. తమకు పెద్దదిక్కుగా ఉండేవారని, వారిమరణం కమ్యూనిస్ట్, ప్రగతిశీల ఉద్యమాలకు తీరని లోటన్నారు. వారి శ్రీమతికి కూడా ఆరోగ్యం క్షీణిస్తున్నదని తెలిసిందన్నారు. బూర్గుల నర్సింగరావు మృతి పట్ల రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. విద్యార్థి ఉద్యమాలకు నాయకత్వం వహించిన యోధుడు బూర్గుల అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమం తొలిదశ నుంచి మలిదశ దాకా పోరాడారు అని గుర్తు చేశారు. ఆయన మరణం తెలంగాణకు తీరని లోటు అని పేర్కొన్నారు.



తెలంగాణకు బూర్గుల సేవలు చిరస్మరణీయమైనవి అని కేటీఆర్ అన్నారు.

మళ్లీ పుంజుకుంటున్న భారత ఆర్థిక వ్యవస్థ

గాడిలో పెట్టేందుకు కేంద్రం తీవ్రంగా కృషి
ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టాలినా జార్జీవా వ్యాఖ్యలే నిదర్శనం
ఐసీఎస్ఐ జాతీయ ఈ-స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి వెంకయ్య

హైదరాబాద్,జనవరి18(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి కారణంగా కాస్త వెనక్కు తగ్గినట్లు కనిపించిన భారత ఆర్థిక వ్యవస్థ త్వరలోనే మళ్లీ ప్రగతిబాట పడుతుందని ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. కరోనా తర్వాత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే దిశగా కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందన్నారు. కరోనాను ఎదుర్కోవడంతో పాటు ఆర్థిక వ్యవస్థను సరిదిద్దేందుకు భారత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అభినందిస్తూ.. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) చీఫ్ క్రిస్టాలినా జార్జీవా ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఉపరాష్ట్రపతి ఉటంకించారు. ఈ ప్రగతిపథంలో భారత కార్పొరేట్ రంగం మరింత చొరవ తీసుకోవాల్సిన అవసరముందని ఆయన సూచించారు. సోమవారం నగరంలో జరిగిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) జాతీయ ఈ-స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా కరోనా మహమ్మారి పెను ప్రభావాన్ని చూపించినప్పటికీ.. భారతదేశం సమిష్టిగా ఈ మహమ్మారిని అడ్డుకోవడంలో కొంతమేర విజయం సాధించిందని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు కూడా చాలా ఇబ్బందులు పడిన విషయాన్ని గుర్తుచేస్తూ.. ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను మరింత ప్రభావవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు భాగస్వామ్య పక్షాలన్నీ ఒకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి అన్నారు. ఐసీఎస్ఐ వంటి సంస్థలు ఉత్తమ కార్పొరేట్ పాలనా పద్ధతులను అవలంబిస్తూ.. మరింత కృషి చేయాలని ఆయన సూచించారు. ఏ సంస్థ పురోగతైనా ఆ సంస్థలో అనుసరించే పద్ధతులపైనే ఆధారపడి ఉంటుందని.. ఆయా సంస్థల్లో పారదర్శకత, సమగ్రత, నిజాయితీ వ్యవస్థను నెలకొల్పడంతో పాటు నైతికతకు పెద్దపీట వేయడంలో కంపెనీ సెక్రటరీలు క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. 'ఆత్మనిర్భర్ భారత్' నినాదంతో ముందుకెళ్తున్న దేశ ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడంలో కంపెనీ సెక్రటరీల పాత్ర చాలా కీలకమన్నారు. ప్రొఫెషనల్‌గా ఉండటంతో పాటు చట్టబద్ధంగా కంపెనీలు పనిచేయడంపైనా దృష్టి పెట్టాలన్నారు. ఇందు కోసం ఉత్తమ పద్ధతులను అవలంబించాలని ఉపరాష్ట్రపతి సూచించారు. నియమాలను, విలువలు, ప్రమాణాలు పాటించేలా కంపెనీ యాజమాన్యాలకు మార్గదర్శనం చేయాలని.. కంపెనీ సెక్రటరీలకు సూచించారు. భారతదేశ వ్యవసాయ రంగాన్ని సుస్థిరం చేసేందుకు జరుగుతున్న విధానపర నిర్ణయాల అమల్లో సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ముందుకు వెళ్లాలన్నారు. కరోనా సమయంలో అన్ని రంగాలు కాస్త ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ.. ఒక్క వ్యవసాయరంగమే.. ఉత్పత్తితో పాటు సాగు కూడాను పెంచి భారతదేశ ఆహార భద్రతను సునిశ్చితం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. భారతదేశంలో యువశక్తికి కొదువలేదని.. కావాల్సిందల్లా ఆ శక్తికి నైపుణ్యాన్ని అందించి ఆత్మనిర్భర భారత నిర్మాణానికి సిద్ధం చేయడంలో వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలు, వివిధ రంగాల ప్రముఖులు కృషిచేయాలని ఉపరాష్ట్రపతి సూచించారు. ఏ రంగంలో ఉన్నవారైనా మన పురాణెతిహాసాలను చదివి అందులోని నైతిక విలువలు, మన బాధ్యతలను అవగతం చేసుకోవాలని ఉపరాష్ట్రపతి సూచించారు. దీంతో పాటుగా వైభవోపేతమైన భారతదేశ చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరాన్ని ఆయన గుర్తుచేశారు. జాతీయవాదాన్ని అలవర్చుకుని ప్రతి అడుగులోనే దేశ శ్రేయస్సును నింపుకుని పనిచేయాలని కూడా ఉపరాష్ట్రపతి సూచించారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో, ఆ తర్వాత ఆధునిక భారత నిర్మాణం కోసం శ్రమించిన సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి మహానుభావుల గురించి అధ్యయనం చేయాలని కూడా ఉపరాష్ట్రపతి సూచించారు. శారీరక దారుఢ్యంతోనే మానసిక ఆరోగ్యం సాధ్యమవుతుందన్న ఉపరాష్ట్రపతి.. కంపెనీ సెక్రటరీలు తీవ్రమైన పని ఒత్తిడిలో పని చేస్తున్నప్పటికీ యోగ, ధ్యానం వంటి వాటి ద్వారా ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని సూచించారు. భారత్‌తో పాటు దుబాయ్, అమెరికా, బ్రిటన్, సింగపూర్‌ల్లోనూ ఐసీఎస్ఐ కార్యకలాపాలు ప్రారంభవడాన్ని ఉపరాష్ట్రపతి హృదయపూర్వకంగా అభినందించారు. పర్యావరణ పరిరక్షణ పైనా కంపెనీ సెక్రటరీలు ప్రత్యేక దృష్టి సారించాలని.. తమ ధైనందిన కార్యకలాపాల్లో ఈ అంశానికి ప్రాధాన్యతనిస్తూ భాగస్వామ్యపక్షాలందరిలో పర్యావరణ స్పృహను పెంచడంతో పాటు వ్యాపార కేంద్రాలు, పరిశ్రమల వద్ద ప్రకృతి పరిరక్షణ జరిగేలా చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హోంమంత్రి మహ్మద్ మహమూద్ అలీ, ఐసీఎస్ఐ అధ్యక్షుడు ఆశిష్ గార్గ్, సంస్థ కార్యదర్శి ఆశిష్ మోహన్, సహకార్యదర్శి అంకుర్ యాదవ్‌తో పాటు కంపెనీ సెక్రటరీలు, కంపెనీ సెక్రటరీ పట్టభద్రులు ప్రత్యక్షంగా, దేశంలోని నాలుగు ప్రధాన కేంద్రాల నుంచి ఆన్‌లైన్ వేదిక ద్వారా పాల్గొన్నారు.

త్వరలో అంగన్‌వాడీలకు పదోన్నతులు

ప్రత్యేక యూనిఫామ్ సిద్ధం
చీరల పంపిణీలో మంత్రి సత్యవతి రాథోడ్

హైదరాబాద్,జనవరి18(ఆర్ఎన్ఎ): డాక్టర్లు, పోలీసులు, ఆశ వర్కర్ల మాదిరిగా అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులకు యూనిఫాం రూపొందించామని మంత్రి సత్యవతి రాథోడ్ చెప్పారు. గతంలో అంగన్‌వాడీ వర్కర్లుగా పిలిచేవారని, సీఎం కేసీఆర్ అంగన్‌వాడీ టీచర్లుగా పిలవాలని మంచి గౌరవం కల్పించారని చెప్పారు. అందరికంటే ఎక్కువసార్లు వేతనాలు పెంచారని గుర్తుచేశారు. మరోమారు జీతాలు పెరుగుతాయని, ఖాళీలను భర్తీ చేసుకుందాని వెల్లడించారు. త్వరలో అంగన్‌వాడీలకు పదోన్నతులు ఇవ్వనున్నామని చెప్పారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు మహిళలు, శిశువులకు సమర్థవంతంగా చేరవేస్తున్నారని మంత్రి అన్నారు. నగరంలోని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనరేట్‌లో అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు, మినీ అంగన్‌వాడీ టీచర్లకు మంత్రి చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీల టీచర్లకు చీరెల పంపిణీని కమిషనరేట్ నుంచి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ చీరెలను కానుకగా భావించాలని చెప్పారు. త్వరలో చేనేత చీరెలు ఇస్తామని వెల్లడించారు. ఈ చీరెల ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలను గౌరవించుకోవడంతోపాటు నేతన్నలకు పని కల్పించాలన్నది ఇందులోని ఉద్దేశమని చెప్పారు. మనపై నమ్మకంతో కరోనా కష్టకాలంలో కూడా సీఎం కేసీఆర్ అంగన్‌వాడీల సేవలు కొనసాగించాలని, పేదలకు అంగన్‌వాడీల ద్వారా ఒక్క పూట భోజనమైనా అందించాలని చెప్పారన్నారు. సీఎం నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవలు కొనసాగించామని ప్రశంసించారు. ఇంకా మరింత అంకితభావంతో చేయాలని సూచించారు. పిల్లలు, బాలింతలు, గర్భిణీలకు అంగన్‌వాడీల అవసరం ఎంతో ఉందని, మార్కెట్లో లభించే సెరెలాక్, ఫారెక్స్ కంటే నాణ్యమైన బాలామృతాన్ని అంగన్‌వాడీలలో ఇస్తున్నామని చెప్పారు. ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా భోజనం, కేసీఆర్ కిట్ కూడా అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత మనపై ఉందని, దానిని సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. గతంలో ఈ కమిషనరేట్ ఆవరణ ఎంతో దారుణంగా ఉండేదని, టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఈ భవనాన్ని ఎంతో అభివృద్ధి చేశారని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు బాగా ఉన్నాయని, అభివృద్ధిలో దూసుకుపోతున్నామని చెప్పారు. కరోనా సమయంలో అంగన్‌వాడీలు చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి వార్డులో అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారని స్త్రీ, శిశు సంక్షేమశాఖ కమిషనర్ దివ్యా దేవరాజన్ అన్నారు. అంగన్‌వాడీలకు ప్రత్యేక గుర్తింపు కోసం యూనిఫాం ఉండాలని దీనిని రూపొందించామని చెప్పారు. టెస్కో ద్వారా ఈ యూనిఫాంలు సిద్ధం చేయించామన్నారు.

రూ. 4 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1,34,000 మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, మినీ అంగన్‌వాడి టీచర్లకు చీరెలు ఇస్తున్నామని తెలిపారు.

చరిత్రలో నేటినిజం

కం॥ గ్వాలియరు మహరాజుగ
పొలంచెడి భువి తెలసిన పాలక మణిగా
తొలి "జియాజి సింధ్యల"
కాలమ్మున తెదురు నిలచు కర్మఠుడగుచున్॥

జనవరి 19 గ్వాలియరు మహారాజు జియాజీరావు సింధియా పుట్టినరోజు...)

-రాధశ్రీ
సెల్: 9494481210

బెంగాల్‌లో మమతకు మద్దతిస్తాం: అఖిలేశ్

లక్నో, జనవరి 18: పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తాము మమతాబెనర్జికి మద్దతిస్తామని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ ప్రకటించారు. విద్వేష రాజకీయాలతో బెంగాల్‌లో అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీని ఓడించడం కోసం తాము అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని నిర్ణయించామని చెప్పారు. ఇవాళ ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగిన పార్టీ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు అఖిలేష్ వెల్లడించారు. ఎక్కడ ఎన్నికలు జరిగినా అక్కడ విద్వేషాలను రెచ్చగొట్టి అధికారంలోకి రావడం బీజేపీకి అలవాటుగా మారిందని అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. 2017లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో సైతం విద్వేష రాజకీయాలతోనే బీజేపీ గెలిచిందని ఆయన విమర్శించారు.

తనయుడిపై తండ్రి దాష్టీకం

టర్పెంటాయిల్ పోసి నిప్పటించి రాక్షసుడు

హైదరాబాద్,జనవరి18(ఆర్ఎన్ఎ): నగరంలోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో దారుణం జరిగింది. కుమారుడిపై టార్పెంటాయిల్ పోసి నిప్పంటించాడు ఓ తండ్రి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని బాధిత విద్యార్థిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. తండ్రిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సరిగా చదవడం లేదనే కోపంతోనే కుమారుడికి నిప్పటించినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. బాధిత విద్యార్థి చరణ్(10) ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు.

రెయిలింగ్‌ను ఢీకొన్న లారీ

హైదరాబాద్,జనవరి18(ఆర్ఎన్ఎ): నగరంలోని బేగంపేట ల్ ఓవర్ వద్ద సోమవారం తెల్లవారుజామున రోడ్డుప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన లారీ అదుపుతప్పి ల్ ఓవర్ రెయిలింగ్‌ను ఢీకొట్టింది. దీంతో లారీ ముందు భాగం దెబ్బతిన్నది. లారీ రోడ్డుపై ఉండటంతో ఆ దారిలో భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. ప్రమాదస్థలికి ట్రాఫిక్ పోలీసులు చేరుకుని క్రేన్ సహాయంతో లారీని పక్కకు తీశారు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

కుంభసందేశ్‌పై 20న రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రెస్‌క్లబ్‌లో సమావేశంపై పోస్టర్ విడుదల: జీ-కాట్

హైదరాబాద్,జనవరి18(ఆర్ఎన్ఎ): భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే కుంభమేళా ఇప్పటికే ప్రారంభమైంది. ఈనెల 14 నుంచి ఏప్రిల్ 27 వరకు ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో ఈసారి జరుగుతోంది సాధారణంగా ఉత్తరాఖండ్ క్షేత్రంతో పాటు.. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ, మహారాష్ట్రలోని నాసిక్, మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలలోనూ కుంభమేళా నిర్వహిస్తారు. కుంభమేళాకు వచ్చే పలువురు సాధుసంతులు చెప్పే విషయాలను భారతీయులందరికీ తెలియజేసే ఉద్దేశంతో కుంభసందేశ్ పేరుతో కుంభమేళాకు ఒక యాత్ర నిర్వహించాలని గ్రామోదయ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ టెక్నాలజీ (జీకాట్) నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కుంభసందేశ్ ప్రాధాన్యం గురించి చర్చించేందుకు భిన్న వర్గాలకు చెందిన ప్రతినిధులతో హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు జీకాట్ వ్యవస్థాపకుడు ఢిల్లీ వసంత్ సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ప్రధానంగా సంపాదకురాలు, ప్రచురణకర్త భారతీయం సత్యవాణి, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, పద్మశ్రీ డాక్టర్ దాసరి ప్రసాదరావు, ఇంపాక్ట్ ఫౌండేషన్ ప్రతినిధి గంపా నాగేశ్వరరావు, నిజామాబాద్‌కు చెందిన నారాయణ జిజ్ఞాస, బీజేపీ మాజీ ఎంఎల్ఏ యెన్నం శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొంటున్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి అన్ని వర్గాల ప్రతినిధులు, విషయాసక్తి కలిగిన ఎవరైనా హాజరు కావచ్చని ఢిల్లీ వసంత్ ఈ సందర్భంగా తెలిపారు. దీనికి సంబంధించి జీకాట్ ప్రతినిధులు ఒక పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు.

మహాత్మాగాంధీ ఆశయాలను ప్రచారం చేసే ఉద్దేశంతో, ఆయన సూచించిన గ్రామస్వరాజ్య సందేశం సమాజానికి ఉపయోగపడాలన్న లక్ష్యంతో రూపొందించిన సంస్థే.. గ్రామోదయ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ టెక్నాలజీ (జీకాట్). కుంభసందేశ్ ఆవశ్యకతను చెప్పడానికే చలో కుంభ్‌యాత్రను చేపట్టాలని జీకాట్ నిర్ణయించింది. కుంభమేళా జరిగే నాలుగు ప్రాంతాలైన నాసిక్, ఉజ్జయిన్, ప్రయాగ, హరిద్వార్ వరకు ఇది జరుగుతుంది. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఇందులో పాల్గొనవచ్చని జీకాట్ ప్రతినిధులు తెలిపారు.

ట్రాక్టర్ల ర్యాలీని నిలవరించాలని సుప్రీంలో పిటిషన్
వ్యవహారం ఢిల్లీ పోలీసుల పరిధిలోనిదని చెప్పిన కోర్టు

విచారణ 20కి వాయిదా వేసిన సుప్రీం

న్యూఢిల్లీ,జనవరి18(ఆర్ఎన్ఎ): దేశరాజధాని ఢిల్లీలో ట్రాక్టర్ల ర్యాలీ జరక్కుండా చూడాలని వేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు స్పందించింది. ఈ సమస్యను ఢిల్లీ పోలీసులు చూసుకుంటారని తెలిపింది. సాగు చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఈనెల 26వ తేదీన ఢిల్లీలో రైతులు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించనున్న విషయం తెలిసిందే. గణతంత్ర దినోత్సవం రోజున జరిగే ట్రాక్టర్ ర్యాలీని అడ్డుకోవాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై అత్యున్నత న్యాయస్థానం స్పందిస్తూ.. ఆందోళన చేస్తున్న రైతుల అంశం ఢిల్లీ పోలీసు శాఖ పరిధిలోకి వస్తుందని, ఎందుకంటే అది శాంతిభద్రతల సమస్య అని సుప్రీం పేర్కొన్నది. ఢిల్లీలోకి ప్రవేశం అంశాన్ని స్థానిక పోలీసులే చూసుకోవాలని, ఎవరికి అనుమతి ఇవ్వాలి, శాంతి భద్రతల సమస్యను ఎలా చూడాలి, ఇలాంటి వాటిపై నిర్ణయం తీసుకునేది తాము కాదు అని కోర్టు తెలిపింది. ఈ కేసు విచారణను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు సుప్రీం చెప్పింది. ట్రాక్టర్ల ర్యాలీలతో ఆర్డీ సంబరాలను అడ్డుకోవడం.. దేశానికి అవమానంగా మిగులుతుందని ఢిల్లీ పోలీసులు తమ పిటీషన్‌లో సుప్రీంకు తెలిపారు. నిరసన చేసే హక్కు ఉంది కాదా అని.. దేశానికి చెడ్డ పేరు తెచ్చే చర్యలు చేపట్టవద్దు అని కేంద్రం తన పిటిషన్‌లో తెలిపింది. అయితే రాజ్‌పథ్‌లో జరిగే పరేడ్‌కు మాత్రం అభ్యంతరం కలిగిచబోము అని రైతు నేతలు పేర్కొన్నారు. సాగు చట్టాలను వ్యతిరేకిస్తూ సుమారు వెయ్యి ట్రాక్టర్లతో ఆ రోజున రైతులు ఢిల్లీలో ర్యాలీ తీయాలని భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో ఢిల్లీ శివారులో రైతుల ఆందోళన సుదీర్ఘంగా కొనసాగుతూనే ఉంది... ఇప్పటికే తొమ్మిది దశలుగా కేంద్ర ప్రభుత్వం, రైతు సంఘాల నేతల మధ్య జరిగిన చర్చలు విఫలం అయ్యాయి. ఇక, సమస్యల పరిష్కారానికి ఓ కమిటీని సుప్రీంకోర్టు ప్రకటించింది.. అది ఎలా ఉన్నా.. రైతులు రోజుకో తరహాలో ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నారు. వారి ఆందోళనలో భాగంగా.. 26వ తేదీన రిపబ్లిక్ డే సందర్భంగా.. ఢిల్లీలో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. అయితే.. రిపబ్లిక్ డేన రైతులు నిర్వహించతలబెట్టిన ట్రాక్టర్ ర్యాలీపై ఇన్‌జంక్షన్ ఇవ్వాలని కోరుతూ ఢిల్లీ పోలీసులు వేసిన పిటిషన్‌పై తదుపరి విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది సుప్రీంకోర్టు. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరగగా... కేంద్రం తరపున కేకే వేణుగోపాల్ వాదనలు వినిపించారు.. రైతుల ర్యాలీ చట్టవిరుద్ధమవుతుంది.. ఢిల్లీలోకి 5000 మంది ప్రజలు అడుగుపెట్టే అవకాశం ఉందని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇక, దీనిపై స్పందించిన అత్యున్నత న్యాయస్థానం.. ఢిల్లీలోకి ప్రవేశమనేది శాంతి భద్రతల పరిస్థితే అయితే.. దానిని నిర్ధారించుకోవాల్సింది పోలీసులేనని వ్యాఖ్యానించింది.. ఢిల్లీ పోలీసులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది.. గణతంత్ర దినోత్సవం దృష్ట్యా పోలీసుల అభిప్రాయం తీసుకుంటామని ఈ సందర్భంగా వ్యాఖ్యానించిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది.

ప్రగతిభవన్‌లో విద్యుత్ ఉద్యోగుల క్యాలెండర్‌ను అవిష్కరించిన మంత్రి కెటిఆర్. చిత్రంలో మంత్రి జగదీశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నిరంతర విద్యుత్‌లో విద్యుత్ సిబ్బంది కృషి మరువలేనిది

డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి కెటిఆర్

హైదరాబాద్,జనవరి18(ఆర్ఎన్ఎ): విద్యుత్ సిబ్బంది కృషితోనే 24 గంటల నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయగలుగుతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో విద్యుత్ ఉద్యోగుల పాత్ర చిరస్మరణీయంగా నిలిచిపోతోందని అన్నారు. అందుకు అనుగుణంగా కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో సైతం విద్యుత్ ఉద్యోగుల పనితీరు అద్భుతంగా ఉందన్నారు. విద్యుత్ ఇంజనీర్ల అసోసియేషన్ రూపొందించిన 2021 డైరీ, క్యాలెండర్‌ను ప్రగతి భవన్‌లో విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డితో కలిసి కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. 24 గంటల నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా విజయవంతం చేయడం వెనుక విద్యుత్ సంస్థల యాజమాన్యాలు, సిబ్బంది తోడ్పాటు ఉందన్నారు. సాధక బాధకాలు తెలిసిన వారికే యాజమాన్య బాధ్యతలు అప్పగించడం ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని ముఖ్యమంత్రి కేసీఆర్ రుజువు చేశారని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనల మేరకు రాష్ట్రంలో వెలుగులు విరజిమ్ముతున్న విద్యుత్ శాఖ మరిన్ని విజయాలు సాధించాలని కేటీఆర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ కో, జెన్ కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్ రావు, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డిలతో పాటు విద్యుత్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీ, ప్రధాన కార్యదర్శి రామేశ్వర్ శెట్టి, సలహాదారుడు అలుగుబెల్లి సురేందర్ రెడ్డి, కంపెనీ అధ్యక్షులు తుల్జారం సింగ్, లక్ష్మయ్యలతో పాటు కార్యదర్శి వై నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు కాళేశ్వరానికి సీఎం కేసీఆర్

హైదరాబాద్,జనవరి 18: ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు మంగళవారం కాళేశ్వరం పర్యటనకు వెళ్లనున్నారు. రేపు ఉదయం 10 గంటలకు హెలికాప్టర్‌లో సీఎం కేసీఆర్ మేడిగడ్డ బ్యారేజ్‌కు చేరుకోనున్నారు. అధికారులతో కలిసి మేడిగడ్డ బ్యారేజీని సీఎం సందర్శించనున్నారు. మేడిగడ్డ వద్ద నీటిమట్టం వంద అడుగులకు చేరింది. ఐదు నెలల విరామం తర్వాత కాళేశ్వరంలో మళ్లీ నీటి ఎత్తిపోతలు ప్రారంభమయ్యాయి. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం లింక్-1, 2లలో గోదావరి జలాల తరలింపు లక్ష్యంగా మోటార్ల ద్వారా ఎత్తిపోస్తున్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత ప్రధానమైంది మేడిగడ్డ బ్యారేజ్. కాళేశ్వరం వద్ద గోదావరిలో ప్రాణహిత కలిసే ప్రాంతానికి ఎగువన మేడిగడ్డ బ్యారేజ్‌ను నిర్మించారు. రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని లిఫ్ట్ చేసే విధంగా డిజైన్ చేసి 1.67 కిలోమీటర్ల పొడవుతో బ్యారేజ్ పూర్తిచేశారు. దీనికి 85 గేట్లను అమర్చి కుడి, ఎడమ వైపున కర కట్టలు కట్టారు. కుడి(తెలంగాణ)వైపున 6.30 కిలోమీటర్లు, ఎడమ (

అమాంతంగా పెరిగిన నిత్యావసర ధరలు !

నేటినిజం
మంగళవారం 19-1-2021

నిత్యావసర ధరలతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. దీనికితోడు పెట్రో ధరలు కూడా అమాంతంగా పెరిగాయి. ఇలా ధరల స్వారీతో సామాన్యులు,పేద, మధ్య తరగతి ప్రజలు బతకడం భారంగా మారుతోంది. వంటనూనెల ధరలు కొనలేనంతగా పెరిగాయి. కరోనాకు ముందు..తరవాత ధరలను పరిశీలిస్తే వస్తువుల ధరలు అనూహ్యంగా పెరిగాయి. ఓ వైపు ఉపాధి కోల్పోయి, ఉద్యోగాలు పోయి కొందరు బతకడమెలా అని బాధపడుతుంటే ధరల పెరుగుదలను ప్రభుత్వాలు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నాయి. నిత్యావసర సరుకులు కొనలేనంతగా పెరుగుతున్నాయి. ఈ సమయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరు దారుణంగా ఉంది. కరోనాకు ముందు వంటనూనెల ధరలు వందలోపు ఉండగా ఇప్పుడు 150కి లీటర్ ప్యాకెట్ అమ్ముతున్నారు. అలాగే పప్పుల ధరలు కూడా అమాంతంగా పెరిగాయి. చక్కర, బెల్లం, కారంపొడి ...ఇలా చెప్పుకుంటూ పోతే ధరల పెరుగుదలతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. ఇలా ఇలా పెరుగుతూ పోతున్నా రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. ధరలు మరింతగా పెరుగు తాయని వ్యాపారులు హెచ్చరిస్తున్నారు. ఇది నిజమన్నట్లుగా గత నాలుగైదు నెలలుగా కిలోకు ఐదు రూపాయల చొప్పున ధరలు పెరుగుతున్నాయి. ఓ వైపు పంటల దిగుబడి పెరుగుతున్నా రైతులకు కనీస ధరలు దక్కడం లేదు. అలాగే మార్కెట్లో పంటలు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. అయినా ధరలు పెరగడం దారుణంగా ఉంది. బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31నుంచి జరుగనున్న నేపథ్యంలో దేశంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.ఇకపోతే దేశ ఆర్థిక మందగమనంపై దిద్దుబాటు చర్యలు తీసుకోవడం ఏ మేరకు సత్ఫలితాలు ఇస్తాయన్నది మున్ముందు తేలనుంది. గతేడాదిగా ఈ పరిస్థితి కొనసాగుతున్నా ముందే చర్యలు తీసుకుని ఉంటే కొంతయినా పరిస్థితి మెరుగు పడేది. గతంలోనే ఆర్‌బిఐ గవర్నర్‌గా ఉన్న రఘురామ్ రాజన్ అనేక హెచ్చరికలు చేసినా పట్టించుకోక పోవడం వల్ల ఈ దుస్థితి ఏర్పడిందనే చెప్పాలి. కారణాలను ఎవరో ఒకరిమీద నెట్టి తప్పించు కోవడం కన్నా దూరదృష్టితో సాగివుంటే ఇలాంటి దుస్థితి వచ్చేది కాదు.

డాలర్‌తో మారక విలువను ఆధీనంలోకి తెచ్చుకోక పోతే మరిన్ని కష్టాలు తప్పవు. అలాగే ఎగుమతులకు ప్రాధాన్యం పెరగాలి. అనవసర దిగుమతులకు కళ్లెం వేయకపోతే ధరలు మనరింతగా పెరగగలదు. అలాగే విదేశీ మారక నిల్వలపై తీవ్రప్రభావం చూపనుంది. దీంతో రూపాయి మరింత బలహీన పడనుంది.ఈ దశలో ఆర్థిక మందగమనానికి మందు వేసేందుకు ప్రభుత్వం గట్టిగానే ప్రయత్నాలు చేస్తోంది. వృద్ధికి ఊతమిచ్చేందుకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఎలాంటి చర్యలను ప్రకటిస్తారన్నది కూడా ముఖ్యమే. ధరలు పెరుగు తున్నా ప్రభుత్వాలు ప్రేక్షక పాత్ర వహించడం ప్రజలను ఆందోళనలకు గురి చేస్తోంది. బ్యాంకింగ్ రంగంలో మొండి బకాయిలు పతాక స్థాయికి చేరడం ఆర్థిక మందగమనానికి కారణంగా చెప్పుకోవాలి. ఎన్‌పిఏలు పెరుగుతున్న కొద్ది వృద్ధిరేటు క్షీణిస్తూ వస్తున్నదని గుర్తించాలి. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే పారిశ్రామిక రంగానికి రుణాలు ఏ మాత్రం అందుబాటులోకి రాకపోవడంతో మార్కెట్‌లో మాంద్యం ఏర్పడిందని అప్పట్లో విమర్శలు వచ్చాయి. అది జిడిపి వృద్ధిరేటు దిగజారడానికి దారి తీసిందని విశ్లేషించారు. చిన్న మధ్యతరహా పరిశ్రమలకైతే రుణ వితరణలో ప్రతికూల వృద్ధి నమోదయింది. దేశ చరిత్రలో పారిశ్రామిక రంగానికి వాణిజ్య రుణాలు భారీగా తగ్గడం కూడా ఇదే ప్రథమమని భావించారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పెట్టుబడి వ్యయాలను గణనీయంగా పెంచడం ద్వారా ఆ లోటును పూడ్చింది.

అంతర్జాతీయంగా వస్తున్న పరిణామాలు మన విదేశీ మారకపు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నాయి. రూపాయి క్షీణత ఇలాగే కొనసాగితే దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే మన దేశానికి ఆర్థిక ఇబ్బందులు తప్పేలా లేవు. వాణిజ్యలోటు, కరెంటు ఖాతా లోటు, ద్రవ్యోల్బణం పెరిగేందుకు రూపాయి పతనం పరోక్షంగా దోహదపడే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. రూపాయి క్షీణతతో దిగుమతులు భారమవుతాయి. చమురు, పసిడి దిగుమతుల వ్యయాలు పెరిగితే, దేశ వాణిజ్య లోటు అధికమవుతుంది. దిగుమతుల కోసం విదేశీ మారకపు నిల్వలను అధికంగా ఖర్చు చేయాల్సి రావడంతో, కరెంటు ఖాతా లోటు కూడా పెరుగుతుంది. ఇది ధరలను అదుపుతప్పేలా చేయడంతో పాటు ద్రవ్యోల్బణానికి కారణం కానుంది. దీనికితోడు సామాన్యుల పిల్లలకు విదేశీ ప్రయాణాలు, చదువుల ఖర్చులు భారమవుతాయి. పెట్రోలు, డీజిల్ ధరలు పెంచాల్సిన పరిస్థితి కొనసాగుతూనే ఉంది. దీంతో రవాణా వ్యయాలు పెరిగి సరకులు ప్రియమవుతాయి. అప్పుడు ద్రవ్యోల్బణం కూడా మరింతగా పెరుగుతుంది.దీంతో పారిశ్రామిక ప్రగతిపై నీలినీడలు కమ్ముకుంటాయి. పరోక్షంగా ఇది దేశ అభివృద్ధిని అడ్డుకుంటుంది. దీంతోపాటు డాలర్ బలపడుతున్నందున, విదేశీ మదుపర్లు దేశీయ మార్కెట్ల నుంచి పెట్టుబడులు ఉపసంహరిస్తే, ఈక్విటీ మార్కెట్లు నష్టపోతాయి. మరోవైపు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా నిరుద్యోగం పెరుగుతున్నది. అలాగే ప్రైవేట్ పెట్టుబడులు తగ్గుతున్నవి. ప్రభుత్వ ఉద్యోగాలకోసం యువత ఎదురుచూడటం ఈ మధ్యకాలంలో ఎక్కువవుతున్నది. ఇలాంటి తక్షణ, అత్యవసర సమస్యల పరిష్కారంపట్ల దృష్టిసారించాల్సిన పార్టీలు నిర్లిప్తంగా ఉంటున్నాయి. రాజకీయాలు నెరిపే పార్టీలు ప్రజా సంక్షేమం, అభివృద్ధి కేంద్రంగా వ్యవహరించాలి. కానీ ఇవేవీ వస్తుగత విషయాలు చేయకుండా నేడు పార్టీలు వ్యవహరిస్తుండటం గమనార్హం. ఈ మధ్య బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ హయాంలో వృద్ధిరేటు ఎక్కువ ఉందంటే తమ హయాంలోనే అని వాదులాడుకున్నాయి. కానీ జరుగుతున్న అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, ఫలాల పంపకం ఏ రీతిన ఉన్నదో చూడడం లేదు. ధరలు దాడి చేస్తున్నా పట్టించపు లేని పాలకులు ఉండడం దారుణం. అభివృద్ధి అన్నది ఉద్యోగ కల్పనకు గీటురాయిగా ఉండాలి. మొత్తానికి ఇప్పట్లో ఆర్థిక రంగం కోలుకునేలా కనిపించడం లేదు. ధరలను కంట్రోల్ చేయలేకపోతే సామాన్యులకు బతుకు భారంగా మారనుంది. దీనిని సరిచేసేందుకు ప్రభుత్వాలు తక్షణ చర్యలకు ఉపక్రమించాలి.

ప్రజావ్యతిరేకతను పట్టించుకోని ప్రభుత్వం

సమస్యలపై కానరాని తక్షణ స్పందన

న్యూఢిల్లీ,జనవరి18(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై తీవ్ర నిరసనలు వ్యక్తం అవుతున్నాయి.ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజల్లో గూడుకట్టుకున్న అసంతృప్తి బడబాగ్నిలా బద్దలయ్యేలా ఉంది. ఇప్పటికే జిస్టీ, నోట్లరద్దు తరవాత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా వాటిని సవరించుకోవడానికి మోడీ ముందుకు రావడం లేదు. తాజాగా వ్యవసాయ చట్టాలు ప్రభుత్వానికి గుదిబండగా మారాయి. సరికదా తనది ఆర్థిక సంస్కరణలని గొప్పగా చెప్పుకుంటున్నారు. బిజెపికున్న ఇమేజ్ మెల్లగా మసకబారిదంనడానికి మోడీ తీసుకున్న నిర్ణయాలే కారణంగా చూడాలి. ఒకప్పుడు బిజెపి అంటే ఓ పాతికమంది ఉద్దండులు, పేరు ప్రతిష్టలు కలిగిన పెద్ద మనుషులు నడుపుతున్న పార్టీగా ఉండేది. కానీ ఇప్పుడది పోయింది. కేవలం ఇద్దరు వ్యక్తులు తమ ఇష్టానుసారం ప్రజలతో సంబంధ లేకుండా నడుపుతున్నారన్న వాదన ప్రజల్లో కూడా బలంగా నాటుకుని పోయింది. అందుకే అన్నివర్గాల్లో వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. పపపారిశ్రామిక వర్గాల్లో మాత్రం ఆనందం నిపిస్తోంది. అయితే ప్రజల్లో నిరుద్యోగం, ధరల మోత వంటి సమస్యల కారణంగా ఇంతగా వ్యతిరేకతను మూటగట్టుకున్న తొలి ప్రభుత్వం ఇదే. అంతేనా అంటే సామాన్యులు కూడా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో దళితులపై జరిగిన వరుస దాడులు, ఉనా, భీమా కోరేగావ్ ఇత్యాది ఘటనలు వారిలో అభద్రతను మరింత పెంచాయి. అలాగే అత్యాచార ఘటనలు కూడా బాగానే పెరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా దళితులపై అత్యధిక దాడులు రికార్డు చేసుకున్న ఐదురాష్ట్రాలు బీజేపీ పాలనలోనివేనని గణాంకాలు తేల్చిచెబుతున్నాయి. అనేకానేక సమస్యలపై ఇంతగా ఆందోళన వ్యక్తం అవుతున్నా ప్రధాని మోడీ కానీ, బీజేపీ పెద్దలు కానీ, ఆయా రాష్ట్రాల ముఖ్య మంత్రులు కానీ దళితులకు విశ్వాసం కలిగించే రీతిలో వ్యవహరించలేకపోయారు.ప్రజల్లో వ్యతిరేకత గూడుకట్టుకుందని పెద్దలు గుర్తించాలి. అందుకు అనుగుణంగా తమ పద్ధతులను మార్చుకోవాలి. సమాజహితం, విశాల భారత ప్రయోజనాల కోసం పనిచేయాలి. అప్పుడే వ్యతిరేకతలు సమసిపోగలవు.

అంతర్గత ఎన్నికలతోనే పార్టీకి పటిష్టత

కాంగ్రెస్ నేత ఎంపికపై మరోమారు సిబల్ వాదన

న్యూఢిల్లీ,జనవరి18(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ పార్టీలో నాయకత్వ మార్పుపై కొన్ని రోజులుగా ఆసక్తికర చర్చ జరుగుతోంది. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఘోరంగా సీట్లు కోల్పోవడం.. హస్తం నేతలు, కార్యకర్తలు ఇతర పార్టీల్లోకి చేరుతుండటంతో పార్టీని కాపాడుకోవడం కోసం నాయకత్వాన్ని మరింత పటిష్టంగా చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకత్వంలో సీనియర్లకు అవకాశం ఇవ్వాలంటూ కపిల్ సిబాల్, గులాం నబీ ఆజాద్ లాంటి పలువురు వెటరన్ లీడర్లు పార్టీ చీఫ్ సోనియాకు లేఖ రాయడం తెలిసిందే. ఈ లేఖ తీవ్ర దుమారాన్ని రేపింది. ఇన్నేళ్లుగా పార్టీని నడిపిస్తూ వస్తున్న గాంధీ కుటుంబీకులను కాదని ఇతరులను పార్టీ చీఫ్‌గా ఒప్పుకునేది లేదంటూ పలువురు సీనియర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, నాయకత్వ మార్పుపై నేతలతో సోనియా చర్చించారు. అంతర్గత ఎన్నికలు నిర్వహణపై హామీ ఇచ్చారు. అయితే ఇది గడిచి చాలా రోజులవుతున్నా విషయం ఇంకా ఓ కొలిక్కి రాలేదు. తాజాగా ఈ అంశంపై కాంగ్రెస్ సీనియర్ నేత కపిల్ సిబాల్ స్పందించారు. పార్టీ నాయకత్వ మార్పునకు సంబంధించి ఎన్నికలను కచ్చితంగా నిర్వహిస్తామని సోనియా చెప్పారని సిబాల్ తెలిపారు. అయితే ఈ ఎలక్షన్స్ ఎలా ఉండబోతున్నాయనే దాని గురించి తనకు పూర్తి సమాచారం లేదన్నారు. దేశంలో ఓ రాజకీయ శక్తిగా నెగ్గుకురావాలంటే అంతర్గత ఎన్నికలు నిర్వహించి, సరైన నేతలకు పగ్గాలు అప్పజెప్పడం చాలా ముఖ్యమన్నారు. పార్టీలో అంతర్గతంగా జరుగుతున్న వ్యవహారాల గురించి తాను

మాట్లాడబోనని, అయితే కాంగ్రెస్‌వాదిగా పార్టీని బలోపేతం చేయడం కోసం ఏం చేయడానికైనా సిద్ధమేనన్నారు. కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ శ్రేణులు నిరాశలో కూరుకుపోయాయని, వారిని తిరిగి ఉత్తేజితం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

వెటర్నరీ వర్సిటీ వీసీగా రవీందర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, జనవరి 18: పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్‌గా డాక్టర్ వంగూరు రవీందర్ రెడ్డి ఇవాళ బాధ్యతలు స్వీకరించారు. పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీలో పౌల్ట్రీ విభాగం ప్రొఫెసర్‌గా, కోరుట్ల వెటర్నరీ అసోసియేట్ డీన్‌గా, వెటర్నరీ సైన్స్ డీన్‌గా, రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఆయన రెండేళ్లక్రితం ఉద్యోగ విరమణ చేశారు. తిరిగి అదే వర్సిటీకి వీసీగా నియమింపబడ్డారు. సోమవారం పశుసంవర్ధక శాఖ కార్యదర్శి, ఇన్‌చార్జి వీసీ అనిత రాజేంద్ర ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపి బాధ్యతలు అప్పగించారు.

సీఎం కేసీఆర్ వ్యవసాయానికి, పశుసంవర్ధక శాఖలకు ప్రాధాన్యం ఇస్తున్నారని, ఆయన ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తామని ఈ సందర్భంగా వీసీ రవీందర్ రెడ్డి అన్నారు. వీసీగా తనకు అవకాశం ఇచ్చిన సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. సహకరించిన పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర రాజకీయాల్లో వారిని ప్రజలు నమ్మరు

కెసిఆర్ పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారు: ఎమ్మెల్యే

హైదరాబాద్,జనవరి18(ఆర్ఎన్ఎ): తెలంగాణలో ప్రభుత్వంపై విమర్శలు చేయాలనుకుంటున్న కాంగ్రెస్, బిజెపిలకు పాలుపోవడం లేదని, ఏ సమస్యా లేకపోవడంతో కావాలనే అనవసర బురద జల్లుతున్నారని వరంగల్ ఎమ్మెల్యే, చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ప్రజలను ఆకట్టుకోగలమో కూడా వారికి తెలియడం లేదన్నారు.

ఎందుకంటే ఏ వర్గాన్నీ వదలకుండా సిఎం కెసిఆర్ అన్ని పథకాలు ప్రకటించి అమలు చేస్తున్నారు. కొత్త ఆలోచనలతో విపక్షాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. చివరకు 24 గంటల కరెంట్ ఇస్తున్నారు. మంచినీటి కోసం మిష్ భగీరథ, చెరువుల తవ్వకం అన్నీ అయిపోయాయి. ఇక ఎకరాకు ఐదువేల సాయం అమలు అవుతోంది. ఈ దశలో మిగిలివున్న వర్గం ఏదైనా ఉందా ఉంటే వారికి ఏం చేయాలన్న దానిపైనా సమాలోచనలు చేస్తున్నారు. గతంలో 24 గంటల కరెంట్ సరఫరాను వ్యతిరేకించిన కాంగ్రెస్ ప్రజల్లో అభాసుపాలయ్యింది. ఇకపోతే కేంద్రం నుంచి సాయంగా ఒక్కపనీ చేయించలేని బిజెపి కూడా అధికారంలోకి వచ్చేది తామే అని కాలుదువ్వుతోంది. నిజానికి ఇప్పుడున్న రెండు సీట్లలో సగం రావడం కష్టమేనని అన్నారు. ఇప్పటికే తెలంగాణ కాంగ్రెస్ అయితే గత ఏడాది కాలంగా ఇదే హామీని రైతుల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. అయితే ఈ హామీలను అధికార టీఆర్ఎస్ కొట్టి పారేస్తుంది. ఒకేసారి రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ సాధ్యంకాదని అధికార పార్టీ చెబుతోంది. అయినా కాంగ్రెస్, బిజెపిలు మాత్రం హామీలతో ముందుకెళ్ళటానికే నిర్ణయించుకున్నాయి. టీఆర్ఎస్ సర్కారు పెట్టుబడి రాయితీ పేరుతో ఎకరాకు ఐదువేల రూపాయల లెక్కన ఇస్తున్నదని అన్నారు. అయితే కేసీఆర్ రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని బిజెపి నేతలు ఆరోపిస్తున్నారు.

తెలంగాణలోనూ తాము అధికారంలోకి వస్తామని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు.. 21 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బిజెపి తెలంగాణలో విజయబావుటా ఎగరేస్తుందని చెబుతున్నారు. తెలంగాణలో రైతులు కష్టాలపాలు అవుతున్నారని అంటున్న వారు ఢిల్లీలో రైతుల ఆందోళనలపై ఎందుకు స్పందించరని అన్నారు. మరోవైపు కాంగ్రెస్ కూడా రైతులను నమ్ముకునే పనిచేస్తోంది. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న టీఆర్ఎస్ ప్రభుత్వ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంటున్నారు. కేసీఆర్ వైఫల్యాల మూలంగానే గడిచిన ఆరేళ్లలో నాలుగు వేలమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.1.74 లక్షల కోట్ల బడ్జెట్‌లో పంటల కొనుగోలుకు ఒక్క రూపాయి కేటాయించ లేదని విమర్శించారు. కమిషన్లకు కక్కుర్తి పడి కాళేశ్వరం ప్రాజెక్టు రీ డిజైన్ చేశారని ఆరోపించారు. కేవలం కాంట్రాక్టర్లకు లాభం చేసేందుకు రూ.85 వేల కోట్లకు అంచనాలు పెంచారన్నారు. నిరుపేదల భూములను కేసీఆర్ ప్రభుత్వం బలవంతంగా లాక్కుంటుందన్నారు. నష్టపరిహారం విషయంలోనూ స్పష్టలేదన్నారు. కుట్రపూరిత ఆలోచనలతో కేంద్రంతో కేసీఆర్ ప్రభుత్వం తటస్థ వైఖరి అవలంబిస్తున్నారని విమర్శించారు.

కాళేశ్వరంతో తీరనున్న కష్టాలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ప్రయోజనమే :మంత్రి

ఆదిలాబాద్,జనవరి19(ఆర్ఎన్ఎ): సాగునీటి ప్రాజెక్టులపై కేసీఆర్‌కు ఉన్న అవగాహనతో పాటు ఆయన రైతాంగం కోసం చేపడుతున్న కార్యక్రమాలు భవిష్యత్ దార్శనికతకు నిదర్శనమని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతలు గోదావరికి మహర్దశ ఇవ్వనున్నాయని అన్నారు. ఈ పనులను కేంద్ర జలసంఘం అభినందించిందని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ చూపి భారీగా నిధులు ఖర్చుపెట్టి రైతాంగానికి సాగునీరు అందించిన తీరు గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అనేక విధాలుగా ఇప్పుడు ప్రయోజనాలు వస్తున్నాయని అన్నారు. ఎస్సీరెస్పీ పురుజ్జీవ పథకం తెలంగాణ చరిత్రలో మైలురాయి వంటిదని మంత్రి అన్నారు. ఎస్సీరెస్పీ పథకంతో తెలంగాణ ఉత్తర ప్రాంతానికి ఎంతో మేలు జరగగలదని శుక్రవారం నాడిక్కడ అన్నారు. సీమాంధ్ర పాలకుల నిర్లక్ష్యంతో అనేక ప్రాజెక్టులకు వేసిన శంకుస్థాపన శిలాఫలకాలు సమాధి రాళ్లుగా మారితే... వాటన్నింటినీ పునరుద్ధరించి కోట్లాది రూపాయలు వెచ్చించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతులకు సాగునీరు అందించారని కొనియాడారు. మంచిర్యాల జిల్లాలో గొల్లవాగు ప్రాజెక్టుకు తెలంగాణ ఏర్పడక ముందు రెండు వేల ఎకరాలకు మాత్రమే నీరివ్వగా..తెలంగాణ ఏర్పాటు అనంతరం అదనంగా 4 వేల ఎకరాలకు నీరు అందించారని చెప్పారు. ర్యాలీవాగు ప్రాజెక్టు కింద గతంలో వెయ్యి ఎకరాలకు మాత్రమే నీరు అందగా... ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తి చేసి అదనంగా 1428 ఎకరాలకు నీరు అందించిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదని అన్నారు. నీల్వాయి ప్రాజెక్టు, వడ్డివాగుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత అదనంగా ఖర్చు చేసి నీరు అందించారని చెప్పారు. కుప్రంభీం ప్రాజెక్టు కింద అదనంగా 9,500 ఎకరాలు, మత్తడివాగు కింద 6,900 ఎకరాలకు నీరందించినట్లు వివరించారు. కింద 9,500 ఎకరాలు, పాల్వాయి ప్రాజెక్టు కింద 5450 ఎకరాలు, గడ్డెన్నవాగు కింద 3వేల ఎకరాలు, సాత్నాల ప్రాజెక్టు కింద 6వేల ఎకరాలు, స్వర్ణ ప్రాజెక్టు కింద 2,500 ఎకరాల అదనపు ఆయకట్టు సేద్యంలోకి రావడానికి ప్రభుత్వం చేసిన కృషి ప్రత్యక్షంగా నిపిస్తోందన్నారు. అలాగే పెనుగంగా, సదర్‌మాట్, స్వర్ణ నదులపై చెక్‌డ్యాములు నిర్మాణంలో ఉన్నట్లు చెప్పారు. జిల్లాలో డిసెంబర్ నాటికి ఇంటింటికీ తాగునీరు అందించి ప్రజారోగ్యాన్ని కాపాడుతామన్నారు. వారిని దృష్టిలో ఉంచుకుని సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు.

గొర్రెల పథకంపై మళ్లీ చిగురించిన ఆశలు

పథకం అమలు కోసం లబ్దిదారుల ఎదురుచూపు

హైదరాబాద్,జనవరి18(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సబ్సిడీ గొర్రెల పథకం ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరంలో రెండో విడత గొర్రెల పంపిణీ చేపడాతమని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో గొర్రె కాపరుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. ఈ మేరకు ఇటీవలే నల్లగొండలో మంత్రి కెటిఆర్ దీనిని ప్రారంభించారు. ఈ నెలలో మొదటి విడతలో డీడీలు చెల్లించి గొర్రెలు పంపిణీ కాని వారికి మాత్రమే పంపిణీ చేస్తామని ప్రకటించారు. గొల్ల, కుర్మలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గాను 2017లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సబ్సిడీ గొర్రెల పథకం కింద జిల్లాల్లో లబ్దిదారులను ఎంపిక చేశారు. అందులో ఒక్కో యూనిట్ వ్యయం లక్షా 25 వేల రూపాయలుగా నిర్ణయించారు. ఇందులో 75 శాతం సబ్సిడీ కింద ప్రభుత్వం , లబ్దిదారుడి వాటా 25 శాతం చెల్లించాల్సి ఉంటుంది. అందులో భాగంగా 2017 జూన్‌లో ప్రభుత్వం పథకాన్ని ఆరంభించింది. అయితే గొర్రెల పంపిణీ కోసం 4 వేల కోట్ల రూపాయలకు పైగా బ్జడెట్ కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో మరో నాలుగైదు నెలల తర్వాత రెండో విడత గొర్రెలను పంపిణీ చేయనున్నారని తెలుస్తున్నది. రెండో విడతలో పంపిణీ చేసే గొర్రెలకు సంబంధించి లబ్దిదారుడి వాటా కింద ఎంపికైన వారి నుంచి ఎలాంటి డీడీలు తీసుకోవడం లేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాతనే డీడీలు తీసుకుంటామని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారులు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి నెలాఖరుతో ముగుస్తుండగా, ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ఆరంభం కానున్నది. ఆలోపు రాష్ట్ర బ్జడెట్ సమావేశాలు జరగనున్నాయి. అందులో కేటాయింపులు చేపట్టే అవకాశం ఉంది. కొందరు పథకం ద్వారా గొర్రెలను పొందేందుకు ఆసక్తి కనబర్చక పోగా, కొందరు మాత్రం డీడీలు చెల్లించారని తెలిపారు. మొదటి గొర్రెల పంపిణీ 2018 జనవరి నాటికే పూర్తి చేయాల్సి ఉండగా, జాప్యం జరిగింది. ఆ కార్యక్రమం సెప్టెంబరు వరకు సాగింది. అదే ఏడాది మార్చి నుంచి రెండో విడత గొర్రెలను పంపిణీ చేయాల్సి ఉండగా ఇంతలో సెప్టెంబరులో ప్రభుత్వాన్ని రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు వెళ్లింది. ఆ ఎన్నికల్లో రెండోసారి అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం రెండో విడత గొర్రెలను పంపిణీ చేస్తామంటూ ఊరిస్తూ వస్తున్నది. కానీ రెండేళ్లు గడిచినా ప్రభుత్వం వాటి ఊసెత్తడం లేదు. అసెంబ్లీ సమావేశాలకు ముందు మాత్రం రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ త్వరలో సబ్సిడీ గొర్రెలు పంపిణీ చేస్తామని ప్రకటనలు చేస్తూ వచ్చారు. కానీ అడుగు ముందుకు కదలలేదు. ఇక రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం ఇక ఉండదని ఆశలు వదులుకున్నారు. ఇటీవల గొల్ల, కుర్మలకు సీఎం కేసీఆర్ వచ్చే ఆర్థిక సంవత్సరంలో బ్జడెట్‌లో బ్జడెట్ కేటాయించి రెండో విడత గొర్రెలు పంపిణీ చేస్తామని ప్రకటించడంతో ఆశలు రేకెత్తుతున్నాయి.

ఎన్టీఆర్‌కు, చంద్రబాబుకు అసలు పోలిక ఉందా?: కొడాలి నాని

అమరావతి, జనవరి 18 : టీడీపీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని మంత్రి కొడాలి నాని అన్నారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి చంద్రబాబు కుట్రలు చేశారని విమర్శించారు.

ఎన్టీఆర్ పార్టీని, సీఎం హోదాను చంద్రబాబు తస్కరించారని మండిపడ్డారు. పదవులు, ఓట్ల కోసం చంద్రబాబు ఎంత నీచానికైనా దిగజారుతాడని అన్నారు.

'ఎన్టీఆర్‌ను ఇష్టపడేవారు చంద్రబాబును రాష్ట్ర సరిహద్దులు దాటించాలి. ఎన్టీఆర్ వర్ధంతి, జయంతి నాడే భారతరత్న ఇవ్వాలని బాబు కోరుతాడు. ఎన్టీఆర్‌కు భారతరత్న తెచ్చే ఉద్దేశం చంద్రబాబుకు లేదు.

నీచమైన పనుల్లో బాబుకు ప్రపంచరత్న ఇవ్వాలి. ఎన్టీఆర్‌కు, చంద్రబాబుకు అసలు పోలిక ఉందా? టీడీపీని సర్వనాశనం చేయగల శక్తి చంద్రబాబు, లోకేశ్‌కే ఉంది.

ఓటుకు కోట్లు కేసులో హైదరాబాద్ నుంచి చంద్రబాబు పారిపోయి వచ్చాడు. అఖిల ప్రియ అరెస్టుపై చంద్రబాబు ఎందుకు నోరు మెదపడు. దేవాలయాలపై దాడుల ఘటనలో ఎవరున్నా కఠిన చర్యలు తీసుకుంటామని' మంత్రి నాని హెచ్చరించారు.

కెసిఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది ఎన్టీయారే అన్న మోత్కుపల్లి

ఎన్టీఆర్‌తో కలసి పనిచేయడం అదృష్టమన్న రావుల చంద్రశేఖర్ రెడ్డి

హైదరాబాద్,జనవరి18(ఆర్ఎన్ఎ): స్వర్గీయ ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా బీజేపీ నేత మోత్కుపల్లి నర్సింహులు ఎన్టీఆర్ ఘాట్‌లో నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎన్టీఆర్‌కు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించి కేసీఆర్ రుణం తీర్చుకోవాలని అన్నారు. కేసీఆర్ నాయకుడు కావటానికి ఎన్టీయారే కారణమని తెలిపారు. కొడుక్కి ఎన్టీఆర్ పేరు పెట్టినంత మాత్రాన రుణం తీరినట్లు కాదన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలనే డిమాండ్‌ను సమర్థిస్తున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ పరిచయం చేసిన పథకాలనే ప్రస్తుత ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని మోత్కుపల్లి నర్సింహులు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీలో ఎన్టీఆర్ తనకు అరుదైన గౌరవం ఇచ్చారని టీడీపీ సీనియర

ఎన్టీఆర్‌తోనే సంక్షేమ పథకాల అమలు

అశోకగజపతిరాజు నివాళి

విజయనగరం,జనవరి18(ఆర్ఎన్ఎ): టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టిఆర్ 25 వ వర్ధంతి సందర్భంగా విజయనగరంలోని కోట జంక్షన్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఎందరో ప్రముఖులు నడయాడిన నేల విజయనగరమని.. అందులో గురజాడ అప్పారావు ఒకరన్నారు. ప్రధాని మోడీ కూడా గురజాడ గొప్పతనాన్ని తెలియజేసారని.. తెలుగు భాషకు స్ఫూర్తి దివంగత నేత ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలుగు భాషను మరిచిపోయే పరిస్థితి ఉందని... అంబేద్కర్ రచించిన రాజ్యాంగ విలువులను కాపాడాలన్నారు. అన్నగారు ముఖ్యమంత్రి అయ్యే వరకు రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు కాలేదని.. ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రం తో పాటు దేశవ్యాప్తంగా సంక్షేమ పథకాలు అమలు అయ్యాయని తెలిపారు. రాజకీయాల్లో సిద్ధాంతాలు అమలు చేసే విధంగా కృషి చేయాలని.. ఆయనతో పాటు పని చేసే అవకాశం రావడం తన అదృష్టమన్నారు. ఎక్కడ చూసినా తెలుగు వాళ్ళు ఎందులో తక్కువ లేదని నిరూపిస్తున్నారని... అన్నగారి కీర్తిని భావి తరాలకు అందించేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

కరోనా వ్యాక్సిన్ తీసుకున్న వ్యక్తి మృతి

గుండెపోటుతో మృతి చెందాడన్న వైద్యులు

లక్నో,జనవరి18(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్‌లోని మోర్దాబాద్ జిల్లాలో విషాదం నెలకొంది. కొవిడ్ టీకా తీసుకున్న 24 గంటల తర్వాత ప్రభుత్వ ఆస్పత్రి ఉద్యోగి చనిపోయాడు. అయితే కొవిడ్ వ్యాక్సిన్ వల్ల ఆ ఉద్యోగి చనిపోలేదని, ఇతర సమస్యల వల్ల మృతి చెందాడని జిల్లా చీఫ్ మెడికల్ ఆఫీసర్ తెలిపారు.

మోర్దాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో వార్డ్ బాయ్‌గా పని చేస్తున్న మహిపాల్ సింగ్ శనివారం కరోనా టీకా తీసుకున్నాడు. ఆదివారం అతనికి ఛాతీలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మహిపాల్ మృతిపై ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. వ్యాక్సిన్ కారణంగా అతను చనిపోలేదని, గుండెపోటు కారణంగానే మృతి చెందినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైందన్నారు. శనివారం రాత్రి డ్యూటీ చేసినప్పుడు అతనిలో ఎలాంటి సమస్యలు లేవు అని పేర్కొన్నారు. మహిపాల్ కుమారుడి కథనం ప్రకారం.. వ్యాక్సిన్ తీసుకునే కంటే ముందే నాన్న అనారోగ్యంగా ఉన్నాడని తెలిపాడు. టీకా తీసుకున్న తర్వాత అతని ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించిందని చెప్పాడు. శనివారం వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో ఇంటికి తీసుకువచ్చాను. ఆ తర్వాత దగ్గు రావడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడ్డాయని కుమారుడు పేర్కొన్నాడు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల ధర్నా

వాహనాల వేగాన్ని తగ్గించాలని డిమాండ్

గుంటూరు,జనవరి18(ఆర్ఎన్ఎ): రోడ్డు ప్రమాదాలను నివారించాలని కోరుతూ.. గుంటూరు జిల్లా మాచర్ల గుంటూరు రహదారిపై చౌటపాపాయపాలెం, రాజుపాలెం గ్రామాల ప్రజలు సోమవారం ధర్నా నిర్వహించారు. నిరసన స్థలానికి వచ్చిన రాజుపాలెం ఎస్ఐ అమీర్ ఆందోళనకారులతో చర్చించారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ.. మాచర్ల బస్సుల వేగాన్ని తగ్గించాలని, లారీల వేగాన్ని తగ్గించాలని కోరారు. మాచర్ల బస్సుల అతి వేగం వల్ల చాలా మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని ప్రజలు తమ ఆక్రోశాన్ని తెలిపారు. ప్రభుత్వం చొరవ తీసుకోకపోతే ధర్నాను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఒక్క ప్రాణం పోయినా ప్రభుత్వానిదే బాధ్యత అని మండిపడ్డారు. రోడ్డు నిర్మాణంపై త్వరితగతిన అధికారులు నిర్ణయం తీసుకోవాలని ప్రజలు కోరారు. రోజూ ప్రజల ప్రాణాలు పోతున్నా కూడా ప్రభుత్వం నుండి ఒక స్పందన రాకపోవడంతో తామంతా ఆందోళన చేపట్టామన్నారు. ఒక నెలలోనే 30 మంది రోడ్డు ప్రమాదంలో తమ ప్రాణాలను పోగొట్టుకున్నారని, ప్రభుత్వం మాత్రం ఏమాత్రం స్పందించలేదని ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. ఇంకా ఎన్ని ప్రాణాలు పోతే ప్రభుత్వం స్పందిస్తుందని ప్రజలు ప్రశ్నించారు. గ్రామస్థుల నిరసనతో రోడ్డుపై ట్రాఫిక్ కొంతసేపు నిలిచింది.

అందరికీ నిరుద్యోగ భృతి

యువతను ఆదుకునేలా ముందుకు రావాలి

అనంతపురం,జనవరి18(ఆర్ఎన్ఎ): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగం కల్పించడం లేదా నిరుద్యోగ భృతి ఇవ్వడం అన్న హామీని అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి జగదీశ్వర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న నిరుద్యోగులందరికీ రాష్ట్రప్రభుత్వం నిరుద్యోగ భృతిని అందించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకోబోయే ఈ నిర్ణయం నిరుద్యోగులకు ఒక తీపి కబురు కానుందన్నారు. అయితే కేవలం ఉపాధి కల్పనా కార్యాలయాలలో పేర్లు నమోదు చేసుకున్న వారికి మాత్రమే నిరుద్యోగ భృతి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోరాదని, అందరికి వర్తించేలా పథకాన్ని అమలు చేయాలని అన్నారు. ఈ అంశాన్ని రాష్ట్రప్రభుత్వం పునారాలోచించాలన్నారు. నిరుద్యోగులు తమ విద్య అర్హతతో అందరూ నమోదు చేసుకునేలా జిల్లాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అన్నారు.ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్ లలో నమోదు చేసుకునేలా చేయాలన్నారు. ఈ నిరుద్యోగ భృతి ముఖ్యంగా ఉద్యోగులు రాని వారికే చెందాలన్నారు. కావున దీనికొరకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక వెబ్ సైట్‌ను రూపొందించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తే మంచిదన్నారు. నిరుద్యోగుల వివరాలను సేకరించడంలో భాగంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న విద్యార్థుల వివరాల సేకరణకుగాను తెల్ల రేషన్ కార్డును ప్రాతిపదికగా తీసుకున్నట్లయితే నిజమైన నిరుద్యోగులు ఎక్కువశాతం బయటపడతారు. అదే విధంగా నిరుద్యోగుల్లో కొందరికి తెల్ల రేషన్ కార్డు లేదు. వీరినీ దృష్టిలో ఉంచుకుని ఇటువంటి వారి వివరాల కొరకు కుటుంబ సంవత్సర ఆదాయాన్ని పరిగణలోకి తీసుకొని, తద్వారా నిజమైన నిరుద్యోగులను ఎంపిక చేసి, వారికే నిరుద్యోగభృతి అందచేయాలన్నారు.

పాఠశాలల్లో పరిశుభ్రమైన టాయిలెట్లు

అధికారులకు సిఎం జగన్ ఆదేశాలు

అమరావతి,జనవరి18(ఆర్ఎన్ఎ): పాఠశాలల్లో పరిశుభ్రమైన టాయిలెట్లు ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఈ మేరకు సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్కూళ్లలో టాయిలెట్స్ నిర్వహణ, విద్యార్థుల హాజరు కోసం మొబైల్ యాప్‌పై సమీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్, పట్టణాభివృద్ధి, పురపాలకశాఖ కార్యదర్శి వై శ్రీలక్ష్మి, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి చినవీరభద్రుడు, సర్వశిక్షా అభియాన్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె వెట్రిసెల్వి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. టాయిలెట్ల నిర్వహణ అనేది ప్రాధాన్యతా అంశం. టాయిలెట్లు లేకపోవటం, ఉన్నవాటిని సక్రమంగా నిర్వహించకపోవటం వల్ల.. చాలావరకు స్కూళ్లకు పిల్లలు పోలేని పరిస్థితి నెలకొంది. ఉత్తమ నిర్వహణ విధానాల ద్వారా పరిశుభ్రమైన టాయిలెట్లను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలి. ఎప్పుడు మరమ్మతు వచ్చినా వెంటనే బాగుచేసేలా చర్యలుండాలి. టాయిలెట్ల క్లీనింగ్‌పై కేర్‌టేకర్లకు అవగాహన కల్పించాలి. విద్యాసంస్థల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. నాడు-నేడు ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. ఇంగ్లీష్ మీడియం ద్వారా అందుబాటులోకి నాణ్యమైన విద్య. విద్యార్థులకు పోషకాహారం కోసం గోరుముద్ద అమలు చేశామని అన్నారు.

బుగ్గన్న వ్యాఖ్యలపై మండిపడ్డ కెఇ ప్రభాకర్

కర్నూలు,జనవరి18(ఆర్ఎన్ఎ): మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిపై టీడీపీ ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి 'మా నాన్న కేఈ మాదన్న గురించి మాట్లాడే స్థాయికి ఇంకా ఎదగలేదన్నారు. మంత్రి హోదాలో ఉన్న బుగ్గన పెద్దలను గౌరవించేలా నడుచుకోవాలని కేఈ ప్రభాకర్ సూచించారు. వ్యంగ్యంగా మాట్లాడటానికి ఇది అసెంబ్లీ కాదు.. డోన్ నియోజకవర్గమని జాగ్రత్తగా మాట్లాడాలని కేఈ ప్రభాకర్ హెచ్చరించారు. ఎన్నో ఏళ్లు సర్పంచిగా పనిచేసిన బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్‌కు ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేఈ ప్రతాప్ కోట్ల రూపాయలతో డోన్‌ను అభివృద్ధి చేశారు. కాని మీరు నియోజవర్గాన్ని ఏం అభివృద్ధి చేశారు' అని కేఈ ప్రభాకర్ ప్రశ్నించారు.

ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి

విజయవాడ,జనవరి18(ఆర్ఎన్ఎ): టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 25వ వర్ధంతి వేడుకలను నగర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వాడవాడలా టీడీపీ శ్రేణులు వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్నారు. పటమట ఎన్టీఆర్ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే గ్గదె రామ్మోహన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేశినేని భవన్‌లో మెగా బ్లడ్ బ్యాంక్ శిబిరాన్ని ఎంపీ కేశినేని నాని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం, దివంగత నేత నందమూరి తారక రామారావు సేవలను నేతలు కొనియాడారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న రాకుండా చేశారు

సొంత కుటుంబ సభ్యులపై మండిపడ్డ లక్ష్మీపార్వతి

వర్ధంతి సందర్భంగా బాబు,బాలకృష్ణ తదితరుల నివాళి

హైదరాబాద్,జనవరి18(ఆర్ఎన్ఎ): దివంగత ముఖ్యంత్రి ఎన్‌టిఆర్ 25 వ వర్ధంతిని పురస్కరించుకొని.. హైదరాబాద్ ఎన్టీఆర్ ఘాట్‌లో లక్ష్మీపార్వతి, నందమూరి బాలకృష్ణ, చంద్రబాబు, తదితరులు రామారావుకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమి బైర్ పర్సన్ లక్ష్మీ పార్వతి మీడియాతో మాట్లాడుతూ.. నందమూరి తారక రామారావు గొప్ప నాయకుడని, ఎందరికో స్ఫూర్తిప్రదాత అని కొనియాడారు. ఎన్టీఆర్‌కు భారతరత్న రాకుండా సొంత కుటుంబ సభ్యులే అడ్డుపడ్డారని లక్ష్మీపార్వతి వ్యాఖ్యానించారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడే కేంద్రంపై ఒత్తిడి చేస్తే ఎప్పుడో వచ్చేదన్నారు. ఎన్టీఆర్ కు భారతరత్న కోసం కేంద్రానికి లేఖ రాయాలని సిఎం జగన్‌ను కోరతానన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న వచ్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఆయన పేరు చెప్పుకోకుండా ఏ పార్టీ కూడా ముందుకు వెళ్లలేదని అన్నారు. ప్రతీ నాయకుడు ఎన్టీఆర్ ఆశీస్సులతోనే ముందుకు పోతున్నారని చెప్పారు. ఎవ్వరు మంచి పరిపాలన చేసినా దాన్ని ఎన్టీఆర్‌తో పోల్చడం పరిపాటి అయిపోయిందని, జగన్‌మోహన్ రెడ్డి పాలన రామరాజ్యంలా కొనసాగుతోందని అన్నారు. మా ఇంట్లో చిన్న ఎన్టీఆర్ వచ్చారు. జనవరి ఫస్ట్‌న పుట్టిన ఆ బాబుకు అప్పుడే నేను ఎన్టీఆర్ అని పేరు పెట్టాను. ఎన్టీఆర్ స్ఫూర్తితో ఆ బాబును పెంచాలను కుంటున్నానని లక్ష్మీపార్వతి తెలిపారు. ఎన్టీఆర్ కుటుంబ సభ్యులయిన నందమూరి బాలకృష్ణ, టిడిపి అధ్యక్షుడు నారా నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీఆర్ 25వ వర్ధంతి సందర్భంగా.. ఎన్టీఆర్ గురించి తప్పుగా మాట్లాడితే సూర్యున్ని వేలితో చూపించడమే అవుతుందన్నారు. ఎలాంటి పరిస్థితులకు వెదరని బెదరని మనిషి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్ పేరు వినగానే శత్రువుల గుండెల్లో రైళ్లు పరుగెత్తాయన్నారు. యుగపురుషుడు అని కొనియాడారు. ఆయన సృష్టించిన చరిత్ర భవిష్యత్తులో ఎవ్వరూ సృష్టించలేరని అన్నారు. తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక, తెలుగు ప్రజల ఆరాధ్య దైవం, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 25వ వర్ధంతిని సోమవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు.. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ 25ఏళ్ల క్రితం, ఇదే రోజున ఎన్టీఆర్ చనిపోయారని, ఏ వ్యక్తి అయినా ఎప్పుడో ఒకసారి చనిపోతారని.. అయితే మనం చేసే పనులు మాత్రం శాశ్వతంగా నిలిచిపోతాయన్నారు. ఏ విలువల కోసం పనిచేస్తామో..ఏ సమాజ హితం ఆకాంక్షిస్తామో.. అది చరిత్రలో చిరస్థాయిగా ఉండిపోతుందన్నారు. నందమూరి తారకరామారావు పేరు ఒక్కసారి చూస్తే.. ప్రతి ఒక్కరూ ఎన్టీఆర్ అని పిలుచుకుంటారని, ఆ పేరు వినగానే శత్రువుల గుండెల్లో రైళ్లు పరుగెడుతాయన్నారు. ఎన్టీఆర్ ఒక యుగపురుషుడని చంద్రబాబు కొనియాడారు. ఆయన సృష్టించిన చరిత్రను భవిష్యత్తులో ఎవరూ సృష్టించలేరని అన్నారు. 292 సినిమాల్లో నటించి.. చలనచిత్ర రంగంలో రారాజుగా వెలిగారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నా యుడు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఎన్టీఆర్‌కు నివాళులర్పించడంతోపాటు అన్నదాన, రక్తదాన శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పార్టీ మీ డియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు తెలిపారు.

హైదరాబాద్ ఎన్టీఆర్ ఘాట్‌లో ఆయనకు నివాళి అర్పించిన లక్ష్మీపార్వతి
బసవతారకం ఆస్పత్రిలో ఎన్నటీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పించిన ఛైర్మన్ బాలకృష్ణ

స్వచ్ఛతలో సిద్దిపేటను ముందు నిలుపుదాం

సిద్దిపేట,జనవరి18(ఆర్ఎన్ఎ): దేశంలోని నగరాల సరసన స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పాల్గొని సిద్దిపేట మున్సిపాలిటీని మొదటి వరుసలో నిలుపుదామని ప్రజలకు ఆర్థిక మంత్రి హరీశ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన 2కే రన్‌లో హరీష్ రావు పాల్గొన్నారు. అనంతరం స్వచ్ఛ సిద్దిపేట సాధించే లక్ష్యంతో కృషి చేస్తానని ప్రతిజ్ఞకు మద్దతు తెలుపుతూ.. బోర్డుపై మంత్రి సంతకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. రన్ ఫర్ స్వచ్ఛ సిద్దిపేట కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ యువత, సిటిజెన్స్ పాల్గొనడం అభినందించదగ్గ విషయమన్నారు. పట్టణ ప్రతి పౌరుడు స్వచ్ఛ సిద్దిపేటకై బాధ్యాతయుతంగా ముందుకు రావాలని కోరారు. స్వచ్ఛ సిద్దిపేట కోసం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇవాళ 2కే రన్ నిర్వహించి స్వచ్ఛ స్ఫూర్తిని చాటారు.. ఇదే స్ఫూర్తిని ముమ్ముందు కొనసాగించాలన్నారు. సిద్దిపేటను శుద్ధిపేటగా మార్చేందుకు ప్రతి రోజు మూడు రకాల చెత్తను వేర్వేరు చేస్తూ భాగస్వామ్యం అవుతున్నామని తెలిపారు. మన ఇంటితో పాటు గల్లీని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇందుకోసం ప్రతి పౌరుడు బాధ్యతతో తన కర్తవ్యాన్ని నిర్వర్తించేలా మెదలాలి అని సూచించారు. ఈ మేరకు స్వచ్ఛ 2కే రన్‌లో పాల్గొని విజేతలుగా నిలిచిన జీ.సాయికృష్ణ, జీ.కిషోర్, డి. శ్రీకాంత్, ఫుట్ బాల్ క్రీడాకారులు ఈశ్వర్, చైతన్య, రమ్య, మౌనిక, కృతిక తదితరులకు మంత్రి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఫారూఖ్ హుస్సేన్, రఘోత్తం రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, ఏఏంసీ చైర్మన్ పాలసాయిరాం, మున్సిపల్ కమిషనర్ రమణాచారి, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు, పట్టణ వాసులు, పట్టణ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛ సిద్దిపేటకై సంతకం చేసి ఫోన్ నంబర్ వేసి ప్రమాణం చేశారు. ఇదిలావుంటే ఇండ్లలోపల మార్బుల్ ఫ్లోరింగ్ మాదిరిగా సిద్దిపేట గల్లీలో సీసీ రోడ్‌లు నిగనిగలాడనున్నాయని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావు చెప్పారు. పచ్చేనెల జాతీయస్థాయిలో జరిగే 28 రాష్ట్రాల కబడ్డీ పోటీలకు సిద్ధిపేట వేదిక కానున్నదని మంత్రి తెలిపారు. జిల్లా కేంద్రమైన సిద్ధిపేటలోని 22వ వార్డు గ్రీన్ ల్యాండ్ కాలనీలో రూ.1.80 లక్షలతో నిర్మిస్తున్న మిషన్ భగీరథ మంచినీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. హైదరాబాదు నెక్లెస్‌రోడ్‌ను తలదన్నేలా సిద్ధిపేటలో సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నదని, మూడు దశల్లో నెక్లెస్‌రోడ్ అభివృద్ధి చేపడుతున్నామని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. నెక్లెస్‌రోడ్ స్టెక్లింగ్, జాగింగ్, రన్నింగ్, వాకింగ్, రిక్రియేషన్ ట్రాక్‌లను ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే మొదటి దశ పూర్తయ్యిందని మంత్రి చెప్పారు. చెట్లుపెంచే వాళ్లంటే తనకెంతో ఇష్టమని, అందుకే గ్రీన్‌లాండ్ కాలనీ వాసులు అడగగానే రూ.34 లక్షలను సీసీ రోడ్ల నిర్మాణం కోసం మంజూరు చేస్తున్నానని ప్రకటించారు. 2021 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పట్టణ ప్రజలంతా ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని మంత్రి పిలుపునిచ్చారు. సిద్ధిపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. మొదటి రింగు రోడ్డుతోపాటు రూ.130 కోట్లతో రెండో రింగురోడ్డు నిర్మిస్తున్నామని, అదేవిధంగా రూ.100 కోట్లతో రంగనాయకసాగర్‌ను అభివృద్ధి చేసుకోబోతున్నామని చెప్పారు. అంతేగాక రూ.20 కోట్లతో త్రీ స్టార్ హోటల్‌ను, రూ.42 కోట్లతో ఐటీ పార్కును వినియోగంలోకి తేనున్నట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, ఏఏంసీ చైర్మన్ పాల సాయిరామ్, వార్డు కౌన్సిలర్ కెమ్మసారం ప్రవీణ్, మున్సిపల్ కమిషనర్ రమణాచారి, ఇతర మున్సిపల్ కౌన్సిలర్లు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో నెక్లెస్ రోడ్డు పనులను ప్రారంభించిన మంత్రి హరీష్ రావు

అంతర్గత రోడ్ల నిర్మాణంలో శ్రద్ధ

పట్టణంలో 2కే రన్‌లో మంత్రి హరీష్‌రావు

అభివృద్ధికి ఆకర్షితులయ్యే టీఆర్ఎస్‌లో చేరికలు

ఖమ్మం, జనవరి 18 : టీఆర్ఎస్‌లోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. జిల్లాలోని బోనకల్లు మండలం తూటికుంట్ల గ్రామంలో వివిధ పార్టీల నుంచి జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు ఆధ్వర్యంలో టీఆర్ఎస్ చేరారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి టీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. పార్టీ కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు.

కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బంధం శ్రీనివాస రావు, రైతు బంధు సమితి మండల కన్వీనర్ వేమూరి ప్రసాద్, మాజీ జడ్పీటీసీ కొండ, గద్దల వెంకటేశ్వర్లు, బోనకల్ మండల టీఆర్ఎస్ పార్టీ యువజన అధ్యక్షుడు కన్నేటి సురేష్, టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేములవాడలో కొనసాగుతున్న రద్దీ

రాజన్న సిరిసిల్ల, జనవరి 18 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం భక్తుల రాకతో రద్దీగా మారింది. వరుసగా ఆదిసోమవారాలు భారీగా భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ధర్మదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని రాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం కావడంతో రాజన్నకు కోడె మొక్కులు చెల్లించుకుంటున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. కొవిడ్ నిబంధనలతో లఘు దర్శనం అమలు చేస్తుండడంతో భక్తులు నందీశ్వరుడి విగ్రహం వద్ద నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

విద్యాసంస్థల ప్రారంభానికి చర్యలు

సిరిసిల్ల,జనవరి18(ఆర్ఎన్ఎ): రాజన్న సిరిసిల్ల జిల్లాలో విద్యాసంస్థలను పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 9, 10, ఇంటర్, డిగ్రీ, తరగతుల ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని, తరగతి గదులను శుభ్రపరిచి శానిటైజ్ చేయించాలని జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్ ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల పున:ప్రారంభంపై అదనపు కలెక్టర్ అంజయ్య, విద్యాశాఖ అధికారులతో ఇప్పటికే సమీక్షించి మార్గదర్శకాలు జారీచేశారు. కొవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు అవగాహన కల్పించడంతో పాటు లిఖిత పూర్వక సమ్మతి పత్రం తీసుకోవాలన్నారు. అలాగే భద్రతా చర్యలు ముఖ్యమని అన్నారు. విద్యార్థుల మధ్య ఆరడుగుల దూరం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ఒకే తరగతి వారికి రెండు గదులను ఉపయోగించాలన్నారు. రెసిడెన్షియల్ హాస్టల్‌లో ఇంకా అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

కొమురవెల్లిలో కొనసాగిన రద్దీ

భారీగా తరలివచ్చిన భక్త జనం

సిద్దిపేట,జనవరి18(ఆర్ఎన్ఎ): కొమురవెల్లిలో రద్దీ కొనసాగుతోంది. భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. పట్నం వారం సందర్భంగా ప్రధాన రహదారులన్నీ కొమురవెల్లి వైపునకే కొనసాగాయి. చేర్యాల, సిద్దిపేట, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, జనగామ తదితర జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా ఆలయానికి తరలివచ్చారు. భారీగా భక్తులు తరలిరావడంతో మల్లన్న ఆలయ ఆవరణలో ఇసుక వేస్తే రాలని పరిస్థితి కనిపించింది. స్వామి వారి దర్శనం, మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలోతరలివచ్చారు. స్వామి వారి దర్శనం కోసం వచ్చే ప్రతి భక్తుడికి వసతి కల్పించేందుకు తాము కృషి చేస్తున్నట్లు మల్లన్న ఆలయ ఈవో ఎ.బాలాజీ, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ దువ్వల మల్లయ్య తెలిపారు. పట్నం వారం సందర్భంగా 70వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల రక్షణ కోసం ఆలయ పరిసరాల్లో 60 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారన్నారు. 60మంది పారిశుధ్య సిబ్బంది, వంద మంది వలంటీర్లు ఎప్పటికప్పుడు సేవలందిస్తున్నారని చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి సోమవారం మల్లికార్జున స్వామి వారిని భక్తులు దర్శించుకొని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారికి పట్నాలు, మల్లన్న గుట్టపైన ఉన్న ఎల్లమ్మకు బోనాలు చెల్లించుకున్నారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారిని దర్శించుకునేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో వేకువజాము నుంచే క్యూలైన్లలో భక్తులు దర్శనానికి వేచి ఉన్నారు. ధర్మ దర్శనానికి 4గంటలు, ప్రత్యేక దర్శనానికి 3 గంటలు, శీఘ్రదర్శనానికి 2 గంటల సమయం పట్టింది.

మల్లన్న స్వామి కల్యాణ వేదిక ప్రాంతంలో మల్లన్న ఆలయవర్గాల సహకారంతో హైదరాబాద్ భక్తుల ఆధ్వర్యంలో సోమవారం పెద్దపట్నం, అగ్నిగుండం కార్యక్రమం జరుగనున్నది. భక్తులు అగ్నిగుండం అనంతరం కొండపోచమ్మ ఆలయానికి తరలిపోతారు. పెద్దపట్నం, అగ్నిగుండం క

వైవస్వత మన్వంతర సప్త మహర్షులు

అనంతమైన భౌగోళిక కాలమానంలో మహాయుగాలు ఎన్నో గడిచిపోయాయి. హిందూ విశ్వ ఆవిర్భావ సిద్ధాంతం ప్రకారం ఒక 'మను' పాలనాకాలాన్ని మన్వంతరమని (మను + అంతరం = మనువు కాలం), ఒక్కో మన్వంతరం 30-85 కోట్ల సంవత్సరాల పాటు జరుగుతుందని తెలుస్తున్నది. 894 కోట్ల సంవత్సరాల ఒక బ్రహ్మ దినంలో 14 మన్వంతరాలు (స్వాయంభువ, స్వారోచిష, ఉత్తమ, తామస, రైవత, చాక్షుష, వైవస్వత, సూర్య సావర్ణిక, దక్షసావర్ణి, బ్రహ్మసావర్ణి, ధర్మసావర్ణి, భద్రసావర్ణి, దేవసావర్ణి మరియు ఇంద్రసావర్ణి) కాలచక్రంగా మారుతూ, ప్రతి మన్వంతరంలో సప్తరుషులు, ఇంద్రుడు మరియు సురులు మారుతూ ఉంటారని అర్థం చేసుకోవాలి. ప్రస్తుతం 7వ వైవస్వత మన్వంతరం నడుస్తున్నదని, దీనికి అధిపతి 'వైవస్వత మనువు' అని పురాణ కథనంతో కూడిన హిందువుల భావన. వైవస్వత మన్వంతరంలోని 71 యుగాలలో 28వ మహాయుగంలో సత్య, త్రేతా, ద్వాపర యుగాల తరువాత కలియుగం నడుస్తున్నది. ప్రస్తుత వైవస్వత మన్వంతరంలో పరశురాముడు, శ్రీరాముడు, బలరాముడు, శ్రీ కృష్ణ, బుద్ధ అవతారాలు జరిగి, కల్కి అవతరించనున్నారు. 'మనువు' అనే పదంలోంచి 'మానవుడు' అనే పదం ఉద్భవించిందని నమ్ముతారు. ప్రస్తుతం నడుస్తున్న వైవస్వత మన్వంతరంలోని మహర్షులలో కశ్యపుడు, అత్రి, వశిష్టుడు, విశ్వామిత్రుడు, గౌతముడు, జమదగ్ని మరియు భరద్వాజుడు అనే సప్తరుషులు ఉన్నారు. ఈ మహర్షుల గూర్చిన కొన్ని మౌళిక అంశాలను తెలుసుకునే ప్రయత్నం చేద్దాం:

1. కశ్యప మహర్షి:

వైవస్వత మన్వంతరంలోని సప్తరుషుల్లో అతి పురాతన రుషియైన కశ్యపుడు ఒకరని రుగ్వేదం తెలుపుతున్నది. కాల-మరీచీల పుత్రుడైన కశ్యపుడు (1500 - 1200 బిసిఈ) రుగ్వేదంలో అనేక శ్లోకాలను రచించాడని నమ్ముతారు. కశ్యపుడి ప్రస్థావన పతంజలి భాష్య శ్లోకాలలో కూడా ఉన్నది. ఇతిహాస, వేద మరియు పురాణాలలో కశ్యపుడి ప్రస్థావన కనిపిస్తుంది. రామాయణ, మహాభారత మరియు విష్ణు పురాణాలలో కశ్యపుడి పాత్ర కనిపిస్తుంది. కశ్యప సంహిత ఆయుర్వేద, కశ్యప జ్ఞానకాండ, కశ్యప ధర్మసూత్ర, కశ్యప సంగీత మరియు కశ్యప శిల్ప లాంటి విలువైన గ్రంథాలను రచించారు. ప్రజాపతి దక్షుడి 13 కూతుర్లను కశ్యపుడు వివాహం చేసుకుంటాడు. కశ్యపుడి భార్య 'దితి'కి హిరణ్యాక్ష మరియు హిరణ్యకష్యపుడు జన్మించారు. హిమాలయాలలోని హిందూ లోయలను కశ్యపుడి పేరుతో పిలుస్తారు. 'కశ్యపమిర' పదంలోంచే 'కశ్మీర్' వచ్చిందని వివరిస్తారు.

2. అత్రి మహర్షి:

హిందూ సాంప్రదాయంలో వైవస్వత మన్వంతరంలోని సప్తరుషుల్లో అత్రి ఒకరుగా రుగ్వేదంలో వర్ణించబడింది. బ్రహ్మ పుత్రుడైన అత్రి పతివ్రత అయిన అనసూయ దేవిని వివాహం చేసుకున్నారు. రుగ్వేదంలోని 5వ మండలాన్ని 'అత్రి మండలం'గా పిలుస్తారు. అత్రి ప్రస్థావన ఇతిహాసాలు మరియు పురాణాలలో ఉన్నది. అత్రి భక్తికి మెచ్చిన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ప్రత్యక్షమై తన కోరికలను తీర్చారు. మరో వివరణ ప్రకారం పతివ్రత అనసూయ దేవికి త్రిమూర్తులు బ్రహ్మ చంద్రగా, విష్ణు దత్తాత్రేయగా మరియు శివుడు దుర్వాసుడిగా జన్మించారని తెలుస్తున్నది. దక్షిణ భారతంలో వైష్ణవిజమ్ పుట్టుకలో వీరి పాత్ర ఉందని వివరించబడింది. అత్రి సంహిత గ్రంథంలో యోగా, జీవన విలువలు తెలుపబడినవి.

3. వశిష్ట మహర్షి:

రుగ్వేదంలోని 7వ మండలాన్ని వశిష్టుడు రచించారు. ఆది శంకరాచార్య హిందూ తత్వసిద్ధాంతం ప్రకారం వశిష్టుడు వేదాంతం ప్రధానమైనదని గుర్తించబడింది. అరుందతిని వివాహం చేసుకున్న వశిష్టుడి తల్లితండ్రులు మిత్రవరుణ మరియు ఊర్వశిగా వేదాలు వివరిస్తున్నాయి. అగ్ని మరియు విష్ణు పురాణాలను రచించిన వశిష్టుడి ఆధీనంలో కామధేను మరియు నందిని ఉండేవని వివరించబడింది. శ్రీ రాముడి గురువుగా మరియు రఘువంశ పూజారిగా వశిష్టుడు ఖ్యాతి గడించారు. వశిష్ట సంహిత, ధర్మసూత్ర, యోగ వశిష్ట, అగ్ని పురాణ మరియు విష్ణు పురాణ గ్రంథాలను రచించారు.

4. విశ్వామిత్ర మహర్షి:

గాయత్రి మంత్రంతో పాటు రుగ్వేదంలోను 3 మండలాలు రచించిన బ్రహ్మరుషి విశ్వామిత్రుడు పురాణ ఆది పురుషుడిగా ప్రసిద్ధిగాంచాడు. రాజర్షిగా పేరుగాంచిన విశ్వామిత్రుడి వివరణ వాల్మీకి రామాయణంలో ఇవ్వబడింది. కౌషిక రాజుగా అమవాసు రాజవంశానికి చెందిన విశ్వామిత్రుడు కుశ రాజు మునిమనుమడిగా 'విష్ణు పురాణ' మరియు 'హరివంశ'లో పేర్కొనబడింది. త్రిశంకు స్వర్గ సృష్టికర్తగా విశ్వామిత్రుడికి గుర్తింపు ఉంది. రామాయణంలో రాముడికి దేవాస్త్ర జ్ఞానాన్ని బోధించి, రాముడిని అస్త్రంగా చేసుకొని తాడక, మారీచ మరియు సుబాహు రాక్షసులను వధించాడు. సీత స్వయంవరానికి శ్రీ రాముడిని తీసుకెళ్లి సీతారామకళ్యాణ కారకుడైనాడు కౌశిక గోత్రం కలిగిన మహర్షి విశ్వామిత్రుడు.

5. గౌతమ మహర్షి:

గౌతమ మహర్షి ప్రస్థావన జైనిజమ్ మరియు బుద్ధిజమ్ మరియు రామాయణాలలో ఉన్నది. తన భార్య అహల్యకు ఇంద్రుడితో సంబంధ కారణంగా శాపం ఇచ్చారు. గోదావరి లేదా గౌతమి నది సృష్టి కర్తగా కూడా పేరు తెచ్చుకున్నారు. వామదేవ కుటుంబ వ్యవస్థాపకుడిగా, గోతమ తండ్రికి పుత్రుడిగా మరియు రుగ్వేదపు 4వ మండల శ్లోక రచయితగా పేరుగాంచారు. వామన పురాణం ప్రకారం జయ, జయంతి మరియు అపరాజిత అనబడే ముగ్గురు కూతుర్లు ఉన్నారు. మహాభారత ఆది పురాణం ప్రకారం శరద్వన్ మరియు సిరాకారి అనే కుమారులు ఉన్నారు. వాల్మీకి రామాయణం ప్రకారం తన భార్య అహల్యకు శతనంద కుమారుడు జన్మించాడు. అంగీరస వంశానికి చెందిన రాహుగణుడి కుమారుడైన గౌతముడికి మరియు అతని కుమారురైన వామదేవుడు, నోధసుడికి మంత్రాల సృష్టికర్తలుగా పేరుంది.

6. జమదగ్ని మహర్షి:

బు?చీకును కొడుకైన జమదగ్ని రేణుకాదేవిని వివాహమాడాడు. భృగు మహర్షి వంశానికి చెందిన జమదగ్ని రేణుకాదేవిల చిన్న కొడుకు పరశురాముడు. అతనికి కోపం బహు మెండు. నీరు తేవడం ఆలస్యమైందనే కారణంగా తన భార్య రేణుకను సంవరించమని కొడుకులను ఆదేశించడం, తండ్రి మాటను పరశురాముడు సిరసావహించి తల్లిని నరకడంతో సంతోషించిన తండ్రి జమదగ్ని ఇచ్చిన వరంతో తల్లిని మరియు సోదరులను పరశురాముడు కాపాడుకోవడం జరుగుతుంది. కార్తవీర్యార్జునుడితో వైరం, కార్తవీర్యార్జునుడి కుమారులు జమదగ్ని తల నరకడం, పరశురాముడు తండ్రిని బతికించుకోవడం లాంటి అంశాలు కూడా జమదగ్ని జీన్మవృత్తాంతం విశేషాలుగా చెప్పబడినవి.

7. భరద్వాజ మహర్షి:

భరద్వాజ అనే సంస్కృతం పదం 'భార(ద్)', 'వాజ్(మ్)'ల కలయిక వల్ల ఉద్భవించింది. పురాణాలలో అత్రి మహర్షి కొడుకుగా చెప్పబడిన భరద్వాజుడి అసలు పేరు 'భరద్వాజ బార్హస్పత్య'గా పేర్కొనబడింది. ఇంద్రుడి వద్ద వైద్యశాస్త్రాన్ని అభ్యసించాడు. సుశీలను వివాహమాడి గర్గ అనబడే కుమారుడికి మరియు దేవవర్ణిణి అనే కుమార్తెకు జన్మనిస్తారు. ద్వాజుడు, భారద్వాజుడు, భారద్వజ మహర్షి అని పలు పేర్లతో కూడా పిలుస్తారు. భరద్వాజు? ప్రశాంత, పవిత్రత కలిగిన సప్త మహర్షులలో ఒకరుగా ఖ్యాతి గడించారు. భరద్వాజ మహర్షి ఆశ్రమాన్ని 'భారద్వజతీర్థ' అని అంటారు.

వేద, ఇతిహాస పురాణ పురుషులుగా నేటి సమాజానికి కూడా దిశనిర్దేశనం చేస్తూ, విలువలుగల హిందూ కుటుంబాలకు దీపస్తంభాలుగా నిలుస్తూ నిలువెత్తు రూపాలుగా వైవస్వత మన్వంతర మహా సప్తర్షులు భగవంతుని ప్రతిరూపాలుగా సదా మనగలుగుతున్నారు. మహర్షుల బోధనలను జీర్ణించుకొని సన్మార్గంలో నడిచే నవసమాజం సుఖశాంతులతో విలసిల్లుతుందనడంలో అతిశయోక్తి లేదు.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఏఆర్ సిబ్బంది పనితీరు శ్లాఘనీయం

సివిల్ పోలీసులతో సమానంగా విధుల నిర్వహణ
ప్రత్యేకించి విపత్తుల సమయంలో వారి సేవలు అమోఘం
యాన్యువల్ మొబిలైజేషన్ పరేడ్‌లో సైబరాబాద్ సీపీ వీసీ సజ్జనార్

హైదరాబాద్,జనవరి18(ఆర్ఎన్ఎ): ఏఆర్ పోలీసుల సేవలు మరువలేనివని సాయుధ పోలీస్ దళాలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అభినందించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన పరేడ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సాయుధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ మాట్లాడుతూ సైబరాబాద్‌లో 2వ సారి మొబిలైజేషన్ పరేడ్ జరపడం సంతోషమన్నారు. ఏఆర్ సిబ్బంది పనితీరు శ్లాఘనీయమన్నారు. ఏఆర్ సిబ్బంది ఒక్క ఏఆర్ డ్యూటీనే కాకుండా ఎస్ఓటీ, షీ టీమ్స్, ఐటి సెల్, స్పెషల్ బ్రాంచ్/ఎస్బీ, సైబర్ క్రైమ్స్, ప్రిజనర్ ఎస్కార్ట్స్, క్యాష్ ఎస్కార్ట్స్, గార్డ్ డ్యూటీస్, ఎంటీ డ్రైవర్స్, స్పెషల్ పార్టీ, పీఎస్ఓ డ్యూటీ, బీడీ టీం, డాగ్ స్క్వాడ్ డ్యూటీస్, పైలట్ అండ్ ఎస్కార్ట్, ట్రాఫిక్ వింగ్, కమ్యూనికేషన్స్, ఎస్సీసీ, కళాబృందం, సిసిఆర్బి, క్లూస్ టీమ్స్ తదితర విభాగాల్లో పనిచేస్తారన్నారు. డ్రైవర్ విధులు వంటి పలు విభాగాల్లో పని చేస్తున్నారని అన్నారు. క్రమశిక్షణతో పనిచేస్తూ ఆయా రంగాలకు మంచి పేరు తెస్తున్నారన్నారు. లా అండ్ ఆర్డర్ పోలీసులతో సమానంగా పని చేస్తున్నారన్నారు. గణేశిశ్ ఉత్సవాల బందోబస్త్, పండుగలప్పుడు, నూతన సంవత్సర వేడుకల రోజు, అసెంబ్లీ ఎలక్షన్స్, పంచాయత్ ఎలక్షన్స్, వరదలు, ముఖ్యంగా కోవిడ్ - 19 కరోనా సమయాల్లో ఏఆర్ సిబ్బంది బాగా పని చేశారన్నారు. ఏఆర్ సిబ్బంది నైపుణ్యాలను మెరుగు పర్చేందుకు, వారిని కొత్త సవాళ్లను స్వీకరించేందుకు సమాయత్తం చేసేందుకు యాన్యువల్ మొబిలైజేషన్ పరేడ్ దోహదపడుతుందన్నారు. యాన్యువల్ మొబిలైజేషన్ పరేడ్ లో భాగంగా ఏఆర్ సిబ్బందికి వారు రోజువారి నిర్వహించే విధుల పట్ల, తర అంశాలపై ట్రైనింగ్ ఇస్తామన్నారు. ఈరోజు ప్రారంభమైన యాన్యువల్ మొబిలైజేషన్ పరేడ్ 15 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఏఆర్ సిబ్బంది క్రమశిక్షణతో ట్రైనింగ్ లో పాల్గొని కొత్త విషయాలను నేర్చుకోవాలన్నారు. కోవిడ్ సమయంలో ఏఆర్ సిబ్బంది బాగా పని చేశారు. అనేక మారుమూల ప్రాంతాల వారికి ఆహారం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారన్నారు.

అలాగే లాక్‌డౌన్ సమయంలో బ్లడ్ బ్యాంక్‌లలో రక్త నిల్వలు తగ్గిపోయాయి. దీంతో ఏప్రిల్ 12న బ్లడ్ డొనేషన్ క్యాంప్‌ను ప్రారంభించి థలసేమియా, క్యాన్సర్ రోగులు, కిడ్నీ దయాలసిస్, గర్భిణీల కోసం మూడు విడతల్లో 7000 యూనిట్ల రక్తం సేకరించి ఇచ్చామన్నారు. కరోనా సమయంలో కోవిడ్ నుంచి కోలుకున్న 5000 మంది నుంచి అవసరమున్న 7000 మందికి ప్లాస్మా దానం చేశామన్నారు. పోలీసులు మంచి జీవన విధానాన్ని అవలంబించాలన్నారు. ఏఆర్ సిబ్బంది ఫిట్నెస్ ను కాపాడుకోవాలన్నారు. రెగ్యులర్‌గా హెల్త్ చెక్ అప్స్ చేయించుకోవాలన్నారు. వ్యాయామాన్ని నిత్య జీవితంలోనూ భాగం చేసుకో వాలన్నారు. రోజులో కొంత సమయాన్ని వ్యాయామం, యోగా కోసం కేటాయించుకోవాలన్నారు. వీలున్నప్పుడు కుటుంబ సభ్యులతో సమయాన్ని గడపాలన్నారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ట్రాఫిక్ డిసిపి ఎస్.ఎమ్. విజయ్ కుమార్ మాట్లాడుతూ ఏఆర్ సిబ్బంది లా అండ్ ఆర్డర్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులతో సమానంగా పని చేస్తూ పోలీసులకు వెన్నెముకలా ఉన్నారన్నారు. 50 శాతం మంది ఏఆర్ సిబ్బంది సహకారంతో డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలకు చేస్తున్నామన్నారు. గతంతో పోలిస్తే ఇటీవల 200 శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గాయి. అలాగే ఓఆర్ఆర్, హైవే పెట్రోలింగ్, కమాండ్ కంట్రోల్ రూమ్, రోడ్డు భద్రత, వర్షాకాలంలో, మరణాలను తగ్గించడంలో ట్రాఫిక్ సిబ్బందితో పాటు ఏఆర్ సిబ్బంది సహకారం ఉందన్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. విధుల్లో నైపుణ్యం సాధించేందుకు ప్రతీ ఏటా నిర్వహించే మొబిలైజేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు సమన్వయంతో పనిచేయాలన్నారు. నిజాయితీతో ప్రజలకు సేవలందించినట్టయితే పోలీసు శాఖకు మంచిగుర్తింపు వస్తుందన్నారు. ఏఆర్, సివిల్ పోలీసులు సమ న్వయంతో పనిచేసినట్టయితే శాంతిభద్రతలను పరిరక్షించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏడీసీపీ (అడ్మిన్)లావణ్య, ఏడీసీపీ సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ మాణిక్ రాజ్, సీఏఆర్ ఏసీపీ లక్ష్మి నారాయణ, ఎస్టేట్ ఆఫీసర్ ఏసీపీ సంతోష్ కుమార్, ఆర్ఐలు , 1635 ఏఆర్ సిబ్బంది, డాక్టర్ సుకుమార్ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కెసిఆర్‌ను తిట్టడానికే బిజెపి కార్యవర్గం బండి సంజయ్ తీరు ఆక్షేపణీయం

మండిపడ్డ టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు
వారసత్వ రాజకీయాలు వారి పార్టీలో లేవా అని ప్రశ్న

హైదరాబాద్,జనవరి18(ఆర్ఎన్ఎ): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆ పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ చేసిన వ్యాఖ్యలపై టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశం కేవలం సీఎం కేసీఆర్‌ను తిట్టడం కోసమే పెట్టినట్లు ఉందని హుజుర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఎద్దేవా చేశారు. కేసీఆర్ అంటే తెలంగాణ.. తెలంగాణ అంటే కేసీఆర్ అని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం కరోనాను కనిపెట్టడంలో విఫలమవగా ఆ సమయంలో కేసీఆర్, టీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత ధీటుగా ఎదుర్కొందో దేశమంతా చూసిందని గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిషన్ కాకతీయ, భగీరథ పథకాలను కేంద్రమంత్రులందరూ పొగిడారని చెప్పారు. గుజరాత్ తరువాత తెలంగాణ మాత్రమే జీఎస్డీ అత్యధికంగా కడుతున్న రాష్ట్రమని ఎమ్మెల్యే తెలిపారు. జనాల మైండ్‌తో గేమ్ ఆడుతూ ఎన్నికల్లో గెలుస్తున్నారని విమర్శించారు. బీజేపీకి రామ మందిరం కట్టడమే ఇష్టం లేదని.. సుప్రీంకోర్టు చెప్పేవరకు పోరాటం చేసిన నేత ఒక్కరూ బీజేపీలో లేరని పేర్కొన్నారు. నేషనల్ స్కిల్ దేవలమెంట్ పెట్టి దేశంలో ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని, తెలంగాణలో 7లక్షల 60 వేల ఉద్యోగాలు ఐటీ ఆధారితతో యువతకు ఉపాధి కల్పించినట్లు వెల్లడించారు. మేక్ ఇన్ ఇండియా లోగోను రూ.10 కోట్లు పెట్టి బయట కొన్నా ఉపయోగం లేదని చెప్పారు. కొన్ని పిచ్చి కుక్కలను రాష్ట్రం మీదకు వదిలారు!.. అని తీవ్రస్థాయిలో బీజేపీ నేతలపై సైదిరెడ్డి విరుచుకుపడ్డారు. మరో ఎమ్మెల్యే గాదరి కిశోర్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. దేశీయ దొంగలు ఇష్టమొచ్చినట్లు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. సత్యహరిశ్చంద్రుడు బతికే ఉంటే వీరి మాటలు విని ఆత్మహత్య చేసుకునే వారని తెలిపారు. దేశంలో మాఫియాను పెంచి పోషించేది బీజేపీ అని, హత్యలు అత్యాచారాలు చేసిన 25 మంది మంత్రివర్గాల్లో ఉన్నారని ఎమ్మెల్యే కిశోర్ ఆరోపించారు. దేశవ్యాప్తంగా కేసులు ఉన్న నేతలు 176 మంది పాలకవర్గంలో కొనసాగుతున్నారని, కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కేసుల వల్ల గతంలో గుజరాత్ నుంచి వెలివేశారని గుర్తుచేశారు. దేశానికి మోదీ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పకుండా అనవసర విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. నల్లధనం పేరుతో ఎంతమందిని అరెస్ట్ చేశారని, పేదలకు ఎంతధనం పంచారో చెప్పాలి? అని ప్రశ్నించారు. మాఫియా అనేది ఎవరో దేశ.. రాష్ట్ర ప్రజలకు తెలుసని తెలిపారు. దేశం బయట ఉన్న డబ్బులు దేశానికి రప్పించ కుండా.. దేశంలో ఉన్న డబ్బులు బయటకు తరలిస్తున్న పార్టీ బీజేపీ అని విమర్శించారు. బండి సంజయ్ కాలం దగ్గర పడిందని హెచ్చరించారు. కేసీఆర్‌ను విమర్శిస్తే తెలంగాణ ప్రజలను అన్నట్లేనని ఎమ్మెల్యే కిశోర్ పేర్కొన్నారు. నాగార్జున సాగర్‌లో ఉప ఎన్నికలో గెలుపు తెలంగాణ రాష్ట్ర సమితిదేనని కిషోర్ పేర్కొన్నారు. కొంతమంది బీజేపీ నేతలు ఇటీవలే ఆ పార్టీ నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో ప్రగల్భాలు పలికారన్నారు. బీజేపీలో 172 మంది ఎంపీలపై ,26 మంది కేంద్ర మంత్రుల పై ఆరోపణలు ఉండడం నిజం కాదా అని ప్రశ్నించారు. బీజేపీదే మాఫియా పార్టీ అని తప్పుబట్టారు. అభివృద్ధిపై బండి సంజయ్ టీఆర్ఎస్ నేతలతో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. దుబ్బాక, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలవగానే బీజేపీ నేతలు ప్రగల్భాలు పలుకుతున్నారని మండిపడ్డారు. కొన్ని రోజుల్లోనే బండి సంజయ్ కథ ముగుస్తుందని హెచ్చరించారు. బండి సంజయ్ అసలు హిందువేనా అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయక పారిపోయిన వ్యక్తి కేంద్ర సహాయ హోంమంత్రి కిషన్‌రెడ్డి జీహెచ్ఎంసీకి ఒక్క పైసా తేలేదన్నారు. కాని ఇప్పుడు ఆయన మాటలు కోటలు దాటుతున్నాయని గాదరి కిషోర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపోతే బీజేపీలో వారసత్వ రాజకీయాలు లేవా అని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ప్రశ్నించారు. సీఎంలు, సీనియర్ నేతల పిల్లలు బీజేపీలో ఎంపీలు కాలేదా అని నిలదీశారు. మంత్రులు కేటీఆర్, హరీష్ రావు ఎమ్మెల్సీ కవితలు ఉద్యమం నుంచి వచ్చారని తెలియదా అని బీజేపీ నేతలను ప్రశ్నించారు. వారిపై కేసులు కూడా నమోదయ్యాయన్నారు. నాడు ఉద్యమానికి మద్దతుగా రాజీనామా చేయకుండా పారిపోయిన కిషన్‌రెడ్డి నేడు వారసత్వ రాజకీయాల పై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని శంభీపూర్ రాజు ఎద్దేవా చేశారు.

పల్లె ప్రగతిలో ప్రజాప్రతినిధుల పాత్ర భేష్

నిజామాబాద్, జనవరి 18: పల్లెల అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ఆలోచనల నుంచి రూపుదిద్దుకున్న కార్యక్రమం పల్లె ప్రగతి. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి, జిల్లాస్థాయి వరకు ప్రజా ప్రతినిధులు నిర్వహించిన పాత్ర ఎంతో అభినందనీయమని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు అధ్యక్షతన నిర్వహించగా మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా పల్లె ప్రగతి కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు అద్భుతంగా పని చేశారని ప్రశంసించారు. గ్రామాలను పరిశుభ్రంగా మార్చారన్నారు. ఇదే స్ఫూర్తితో ఇంకా ఏమైనా పనులు మిగిలి ఉంటే వాటిని కూడా పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే ఎటువంటి సమస్యలు లేకుండా కరోనా వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగిస్తున్నామని తెలిపారు. ధరణి పోర్టల్‌పై ప్రజా ప్రతినిధులు రైతులకు ఆయా విషయాలపై అవగాహన కల్పించి వారు దరఖాస్తు చేసుకునే విధంగా చూడాలని కోరారు.

గ్రామాలు మండలాల్లో రోడ్ల డ్యామేజ్ పై సభ్యులు మరమ్మతులకు నిధులు కోరగా జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో కనీసం 20 నుంచి 30 కోట్ల రూపాయలు రహదారులకు వాటి మరమ్మతులకు మంజూరు చేశామన్నారు. గత సంవత్సరం ఉపాధి హామీ పథకంలో 95 కోట్ల రూపాయలు ఖర్చు కాగా ఈ సంవత్సరం 120 కోట్ల రూపాయలు ఖర్చు చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే రూ.113 కోట్లు ఖర్చు చేశామని ఇందుకు గాను సంబంధిత అధికారులందరినీ అభినందిస్తున్నానని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, శాసన మండలి సభ్యులు వీఎం గౌడ్, జిల్లా పరిషత్ సీఈవో గోవిందు, జెడ్పీటీసీలు, ఎంపీపలు, అధికారులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం

నిజామాబాద్, జనవరి 18 : కృషి, పట్టుదలతో ఎదిగి రాజకీయాల్లో ఉన్నత పదవులు చేపట్టిన గొప్ప వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్ అని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. జిల్లాలోని బాల్కొండ మండలం ఇతవార్‌పేట్ గ్రామంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడాతు..జగ్జీవన్ రామ్ ఉప ప్రధాని పదవి చేపట్టి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం తపించారని ఆయన సేవలను కొనియాడారు. జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన క్రికెటర్ హనుమ విహారి

హైదరాబాద్, జనవరి 18 : టీమ్ ఇండియా బ్యాట్స్‌మన్ హనుమ విహారి సోమవారం తెలంగాణ ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశాడు. ఆసీస్ గడ్డపై చిరస్మరణీయ ప్రదర్శన చేసిన విహారిని మంత్రి కేటీఆర్ శాలువాతో సన్మానించారు. ఆసీస్ పర్యటనకు సంబంధించిన విషయాలను విహారీ..కేటీఆర్‌కు వివరించాడు. మిమ్మల్ని కలవడం, క్రికెట్ గురించి సంభాషించడం చాలా ఆనందంగా ఉందని విహారి ట్విటర్లో పేర్కొన్నాడు. కేటీఆర్‌తో దిగిన ఫొటోను తెలుగు క్రికెటర్ షేర్ చేశాడు.

ఆస్ట్రేలియాతో మూడో టెస్టులో అద్భుత డిఫెన్స్‌తో ఆకట్టుకున్న హనుమ విహారీ , రవిచంద్రన్ అశ్విన్ మ్యాచ్ డ్రాగా ముగియడంలో కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. తొడకండరాల గాయం కారణంగా విహారి ఆఖరిదైన నాలుగో టెస్టుకు దూరంకావడంతో ఇటీవల స్వదేశం చేరుకున్నాడు. మూడో టెస్టును టీమ్‌ఇండియా డ్రా చేసుకోవడంపై మంత్రి కేటీఆర్ ట్విటర్‌లో స్పందించిన విషయం తెలిసిందే. టెస్టు డ్రా..ఇన్నింగ్స్ విజయం కన్నా బాగుందని ప్రశంసించారు.

ఏపీలో భారీగా తగ్గిన కరోనా కేసులు

అమరావతి, జనవరి 18 : ఏపీలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య భారీగా తగ్గింది. గడిచిన 24 గంటల వ్యవధిలో ఆ రాష్ట్రంలో కొత్తగా కేవలం 81 కేసులు మాత్రమే నమోదయ్యాయి. కరోనా బారినపడిన వారిలో 263 కోలుకొని డిశ్చార్జి అయ్యారు. ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఏపీలో ఇప్పటివరకు 8,86,066 కొవిడ్ కేసులు నమోదయ్యాయి. 8,77,212 మంది చికిత్సకు కోలుకున్నారు.మరో 1713 మంది దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. నేటి వరకు 7141 మంది మృత్యువాతపడ్డారని ఆ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నివేదికలో వెల్లడించింది. గడిచిన 24 గంటల్లో 27,861 మందికి కొవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించామని అధికారులు తెలిపారు.

జనవరి 19 నుంచి ఐదు రోజుల ప్లాస్టిక్ వర్చువల్ ఎగ్జిబిషన్ 'ప్లాస్టీ వరల్డ్' సంరంభం

హైదరాబాద్, జనవరి, 18: అఖిల భారత ప్లాస్టిక్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఎఐపీఎంఎ) ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు ప్లాస్టిక్ వర్చువల్ ఎగ్జిబిషన్ 'ప్లాస్టీ వరల్డ్' జరుగనున్నది. 68కి పైగా దేశాల నుంచి 100కిపైగా ఎగ్జిబిటర్లు, 12 వేల మంది పై చిలుకు సందర్శకులతో ఈ ఎగ్జిబిషన్ సందడిగా సాగనున్నది. 'ఎఐపీఎంఎ'లో భారతదేశంలోని 175కి పైగా నగరాల పరిధిలో 20 వేలకుపైగా సంస్థలు, సంఘాలు భాగస్వాములుగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా రూ.1000 కోట్ల బిజినెస్ సాధించడమే లక్ష్యంగా ఈ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు.

ఈ ఎగ్జిబిషన్‌కు కేంద్ర కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్స్, వాణిజ్య మంత్రిత్వశాఖలు, సీపెట్‌తోపాటు దేశంలోని 15 ప్రధాన సంస్థలు, సంఘాలు మద్దతునిస్తున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే సంరంభంలో వివిధ సంస్థల సీఈఓలు, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లు, విభాగాల అధిపతులు, మేనేజింగ్ డైరెక్టర్లు, డిప్యూటీ మేనేజర్లతోపాటు వివిధ దేశాల నుంచి పేరొందిన సంస్థల ప్రముఖులు పాల్గొననున్నారు. అమెరికా, సింగపూర్, మలేషియా, ఇటలీ, జర్